Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 27.07.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 08 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## ప్యాకేజ్ బాబుకు...
# ఢిల్లీలో డామేజ్

- అవిశ్వాస తీర్మానంతో నిద్రపోతున్న గుర్రాన్ని లేపి తన్నించుకున్నట్లయ్యింది
- టీడీపీ - బీజేపీల తెరచాటు కాపురాన్ని బయటపెట్టిన రాజ్‌నాథ్
- కేసీఆర్‌ను పొగిడి చంద్రబాబును చిన్నబుచ్చిన ప్రధాని మోడీ

ప్రత్యేకహోదాపై తెలుగుదేశం ఎంపీ కేశినేని నాని ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అనుమతించగానే రాజకీయ విశ్లేషకులలో చాలా అనుమానాలొచ్చాయి. వైసిపి 13సార్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చినా స్పీకర్ అనుమతించలేదు... వైసిపి ఎంపీలు రాజీనామా చేసాక తెలుగుదేశం ఎంపీ అలా నోటీసు ఇవ్వగానే ఇలా అనుమతించారు. టీడీపీ-బీజేపీల మధ్య రహస్య స్నేహం కొనసాగుతుంది... అందుకే దీనిని అనుమతించారని ఒక సందేహం వినిపించింది. అలా కాదు... అవిశ్వాస తీర్మానంపై చర్చను ఆధారం చేసుకుని బీజేపీ సభ్యులు తెలుగుదేశంను చీల్చి చెండాడబోతున్నారు, చంద్రబాబు ప్రభుత్వ నాలుగేళ్ళ అవినీతి అక్రమాలను బయటపెట్టబోతున్నారనే వాదన కూడా వినిపించింది.

తీరా లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో జరిగిన సంఘటనలు చూస్తే పై రెండూ నిజం కాలేదు. బీజేపీ చంద్రబాబు పట్ల సానుభూతి చూపలేదు... అట్లాగని పూర్తి శత్రువుగా చూసి చీల్చి చెండాడనూ లేదు. 40ఏళ్ళ రాజకీయ అనుభవమున్న చంద్రబాబును ఒక వెర్రివెంగళప్ప అన్నట్లు చిత్రీకరించారు. చంద్రబాబు కంటే కేసీఆరే నయం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ నిండు సభలో

(మిగతా 11వ పేజీలో)






# పవన్‌పై పేలిన జ'గన్'

ప్రజల కోసం పోరాడే ఏ నాయకుడైనా ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించాలి. అవినీతి, అక్రమాలను నిలదీయాలి, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లో పవర్‌స్టార్ అనబడే పవన్ కళ్యాణ్ ఏం చేసాడు? 2014లో తాను పోటీ చేయకుండా టీడీపీకి మద్దతునిచ్చాడు. టీడీపీ గెలుపుకు సహకరించాడు. నాలుగేళ్ళు ఆ పార్టీతోనే అంటకాగాడు. ఈమధ్యనే గుంటూరులో సభ పెట్టి తెలుగుదేశం ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించాడు. పవన్ విమర్శలకు అప్పుడు చంద్రబాబు కూడా షాకయ్యాడని మీడియాలో రావడం చూసాం.

పవన్ ప్రభుత్వాన్ని విమర్శించడంలో అర్ధముంది. అదే సమయంలో ప్రతిపక్ష నేత వై.యస్.జగన్‌పై కూడా విమర్శలకు పాల్పడుతున్నాడు. ఇంతవరకు వైసిపి అధికారంలోకి రాలేదు. జగన్ పరిపాలన చేయలేదు. రాష్ట్రంలో ఏ సమస్యకూ జగన్ కారణం కాదు. పవన్ ప్రస్తావించే ప్రత్యేకహోదా అంశంపై కూడా ఎక్కువుగా పోరాడుతున్నది జగనే! అయినా కూడా జగన్‌నే లక్ష్యంగా చేసుకుని పవన్ విమర్శలు చేయడం ఇటీవలకాలంలో ఎక్కువైంది. పవన్ తనపై ఎంతగా విమర్శలు చేస్తున్నా జగన్ ఏరోజూ అతనిపై ఘాటుగా ప్రతిదాడి చేయలేదు. ప్రజాసమస్యలపై నిజంగా పోరాటం చెయ్యాలంటే పవన్ ముందుగా చంద్రబాబు కౌగిలి నుండి బయటపడాలని మాత్రమే జగన్ కోరుతుండేవాడు. కాని, ప్రత్యేకహోదా కోరుతూ మొన్న వైసిపి నిర్వహించిన రాష్ట్ర బంద్‌కు పవన్ మాట మాత్రం మద్దతు కూడా తెలపలేదు. ఆ

(మిగతా 11వ పేజీలో)



# దుర్గంపల్లిని వణికిస్తున్న.. చిరుత



## 22 మేకల్ని చంపిన ఘటనతో బెంబేలెత్తుతున్న గ్రామస్తులు

ఉదయగిరి మండలంలోని దుర్గంపల్లి అటవీప్రాంతంలో ఒక చిరుతపులి 22 మేకల్ని చంపేసింది. దీంతో మేకల యజమానుల గోడు వర్ణనాతీతం. ఈ నెల 21న ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుర్గంపల్లికి చెందిన సింగనబోయిన రత్తమ్మ, పెద్దచెన్నయ్య, మోహన్, గడ్డం మల్లికార్జునలకు చెందిన 21 మేకలు, రెండు మేకపోతులను మేత కోసం గ్రామానికి ఆనుకుని ఉన్న కొండపై అటవీప్రాంతంలోకి తోలుకెళ్ళారు. పొదల్లో మాటువేసి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా వాటిపైకి దూకడంతో వారు భయపడి గ్రామంలోకి పరుగుతీశారు. చిరుతదాడిలో గాయపడిన ఒక మేక మాత్రం వారితోపాటు ప్రాణం ఉగ్గబట్టుకుని ఊళ్ళోకి వచ్చేసింది. ఆ తర్వాత, గ్రామస్తులంతా కలసి అటవీప్రాంతంలో మేకల కోసం వెతుకుతుండగా 20 మేకలు, 2 మేకపోతులు చిరుతపులి దాడితో చచ్చిపడి ఉన్నాయి. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమై భయం గొలిపేవిధంగా ఉంది. మేకలు మేపుకుంటూ జీవనం సాగించుకునేవారు మేకల కళేబరాలను చూసి పెద్దపెట్టున రోదించారు. తమను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కాగా, దుర్గంపల్లి అడవుల్లో చిరుత సంచారం స్థానికులను బెంబేలెత్తిస్తోంది. హనుమాన్‌కాలువ సమీపంలో ఆ చిరుతపులి కనిపించిందని కూడా కొందరంటున్నారు. అటవీశాఖవారు వెంటనే ఈ విషయం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని దుర్గంపల్లి ప్రజలు కోరుతున్నారు.

### నరసాపురం ఎంవిఆర్ఆర్ జడ్పీ హైస్కూల్...


# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

## • చిన్ననాటి జ్ఞాపకాలతో పరవశం



బాల్యమిత్రుల సత్కారాన్నందుకుంటున్న పేరిశెట్ల వెంకటశివకుమార్-అరుణకుమారి దంపతులు

వారంతా 1978లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు. చదువులు పూర్తయ్యాక వారు ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా ఎక్కడెక్కడో ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే, చిన్ననాటి స్నేహితులమంతా మళ్ళీ ఒకసారి కలిస్తే ఆ అపూర్వకలయిక ఎంతో మధురంగా ఉంటుందని భావించి అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకున్నారు. అనుకున్నట్లుగానే అందరూ కలసి ఆ బాల్యస్మృతులను సంతోషంగా పంచుకున్నారు. ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం ఎంవిఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 1978లో 10వ తరగతి చదువుకున్నవారంతా ఈ నెల 22న గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. పాఠశాలలో చదువుకున్న నాటి రోజులను..చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. ఈ సందర్భంగా తమకు బాల్యమిత్రుడైన కవి, రచయిత, కళాకారుడు, వైద్యుడు పేరిశెట్ల వెంకటశివకుమార్-అరుణకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. శివకుమార్ రచనలను, పద్యాలు కవితలను, ఆయన అందుకున్న అవార్డులను ప్రస్తావిస్తూ వారిని కొనియాడారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ ఈ సందర్భంగా 'పంచరత్నాలు' పద్యాలతో ఆయనకు అక్షరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ పెనుబల్లి రామచంద్రనాయుడు, ఆలయ ఇ.ఓ రవీంద్రరెడ్డితో పాటు కొండూరు సుధాకర్‌రెడ్డి, పెనుబల్లి హనుమంత రావునాయుడు, ఉప సర్పంచ్ రాయసం వెంకటేశ్వరరావు, పూర్వవిద్యార్థులు స్వర్ణా నాగేశ్వరరెడ్డి, బత్తల సుబ్బయ్య, తోటపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, చిట్టిబాబు, ఈశ్వరయ్య, ఎ.వి రమణయ్య, పి.బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విఆర్‌కు డివి సత్రం ఎస్.ఐ

ఇటీవల వెంకటాచలం ఎస్సైను సస్పెన్షన్ చేసిన జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ తాజాగా మరో ఎస్సైపై వేటు వేశారు.దొరవారిసత్రం ఎస్సై సీహెచ్ కోటిరెడ్డిని వీఆర్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇసుక ట్రాక్టర్ యజమానుల వద్ద అధికమొత్తంలో మామూళ్ళు తీసుకుంటూ, వేదిస్తూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ పోలీసు ప్రతిష్టను దెబ్బతీస్తున్నట్లు ఎస్పీ విచారణలో రుజువయ్యాయి. దీంతో పాటు స్టేషన్‌కు వచ్చే ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తుండడంతో ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఏ-2పై వేటు

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ-2గా పనిచేస్తున్న ప్రతాప్‌ను జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడనే ఆరోపణలతో ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో పోలీసులకు జరిగిన బదిలీల్లో కూడా ప్రతాప్ విధులను సక్రమంగా నిర్వహించలేదని తెలిసి ఎస్పీ ఆయన్ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

# జనసేనలోకి మనుక్రాంత్



మనమను ఆర్గనైజేషన్ అధినేత, మాష్‌కామ్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మనుక్రాంత్‌రెడ్డి జనసేన పార్టీలో చేరాడు. 25వ తేదీన ఆయన విజయవాడలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఈ సందర్భంగా మనుక్రాంత్‌ను పవన్‌కళ్యాణ్ అభినందిస్తూ నేటి రాజకీయాలకు దార్శనికత వున్న ఇలాంటి యువకుల అవసరం ఎంతో వుంద న్నారు. మనుక్రాంత్ ఆలోచనా విధానాన్ని, ఆయన అనుభవాన్ని పార్టీకి ఉపయోగించు కుంటామన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానాలకు, ప్రజాసమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధతకు, పోరాటతత్వానికి ఆకర్షితుడినై జనసేన పార్టీలో చేరినట్లు మనుక్రాంత్ తెలిపారు. రాజకీయాలను ప్రక్షాళన చేయాల్సి వుందని, అవినీతి, అక్రమాలతో నిండిన ఈ కుళ్ళు రాజకీయాలు అంతరించాలంటే పవన్‌కళ్యాణ్ లాంటి వారి నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. త్వరలోనే నెల్లూరులో జనసేన కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజల్లోకి పార్టీ కార్యక్రమాలను తీసుకువెళతామన్నారు.

మనుక్రాంత్ స్వస్థలం నెల్లూరుజిల్లాలోని కలివెలపాలెం. 2005లో యూయస్‌ఏలో సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి ఎందరికో ఉద్యోగావకాశాలు కల్పించాడు. జన్మభూమి మీద వున్న మమకారంతో ఇటీవలే నెల్లూరుకు తిరిగొచ్చాడు. తన పురిటి గడ్డ నెల్లూరు లోనూ సాఫ్ట్‌వేర్ కంపెనీలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో నెల్లూరులో మాష్‌కామ్ టెక్నాలజీని ప్రారంభించారు. అలాగే మనమను ఆర్గనైజేషన్ ద్వారా నెల్లూరురూరల్ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## రాజకీయాన్ని వదిలి రెవెన్యూలోకి...
# కలెక్టర్ వివాదం

ఈమధ్యంతా కలెక్టర్ ముత్యాలరాజుపై సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణల దాడితో జిల్లాలో వాతావరణం వేడెక్కడం తెలిసిందే! సర్వేపల్లిలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దూకుడును అడ్డుకోవడానికి కాకాణి కలెక్టర్ ముత్యాలరాజును ఒక అస్త్రంగా వాడుకున్నాడు. అతనిపై ఆరోపణలను ఎక్కుపెట్టాడు. దీంతో కొన్నిరోజుల పాటు కలెక్టర్ వర్సెస్ కాకాణి అన్నట్లుగా యుద్ధం నడిచింది. కలెక్టర్‌పై కాకాణి విమర్శలను నిరసిస్తూ ఉద్యోగ సంఘాలు ఆందోళనకు దిగాయి. బీసీ సంఘాలు ధర్నా చేసాయి. తెలుగుదేశం పార్టీ వాళ్ళు కూడా కలెక్టర్‌కు మద్దతుగా ర్యాలీలు చేసారు.

అయితే అధికారులతో ఎక్కువగా పెట్టుకోవద్దని వైసిపి అధిష్టానం చేసిన హెచ్చరికలతో కాకాణి కలెక్టర్‌పై దూకుడు తగ్గించాడు. తన టార్గెట్ అధికారపార్టీ నాయకులే కాని అధికారులు కాదంటూ మెత్తబడ్డాడు. కలెక్టర్, కాకాణిల గొడవ దాదాపు తెరమరుగైనట్లే! కాని వీళ్ళిద్దరి మధ్య వివాదం నడుస్తున్న సమయంలో కలెక్టర్‌కు వ్యతిరేకంగా ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రూపొందించిన కథనాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ మెసేజ్ చాలామంది సెల్‌ఫోన్‌లలోకి వెళ్ళిపోయింది. అయితే ఇది రాజకీయ నాయకుల పని కాదని, ఇంటి దొంగల పనేనని పసిగట్టారు. ముఖ్యంగా ఇటీవల కలెక్టర్ చేతిలో చీవాట్లు తిన్న ఓ తహశీల్దారే దీనికి కర్త, కర్మ, క్రియ అని గుర్తించారు. కలెక్టరేట్ ఏ.ఓ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మధ్యలో రెవెన్యూ సంఘాల నాయకులు రంగంలోకి దిగి కలెక్టర్‌పై సోషల్ మీడియాలో విషప్రచారానికి దిగిన అధికారులను రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టర్‌పై కాకాణి చేసిన విమర్శలకంటే కూడా ప్రభుత్వ శాఖలో అధికారులు చేసిన విషప్రచారమే ఎక్కువ ప్రభావం చూపింది.

# ఎక్కడి లారీలు అక్కడే...



వారంరోజులుగా ఎక్కడి లారీలు అక్కడే ఆగిపోయివున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లారీ యజమానులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె ఉధృ తంగా సాగుతోంది. లారీలు యార్డ్‌లలో నిలిచిపోయాయి. సరుకు రవాణా స్థంభించి పోయింది. లారీల సమ్మెతో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, కాలం చెల్లిన టోల్‌గేట్లను ఎత్తివేయడం, డీజిల్ రేట్లు తగ్గించడం తదితర డిమాండ్లతో లారీల సమ్మె జరుగుతోంది.

## • కావలి నియోజకవర్గంలో కలకలం
# అల్లూరు పల్లెలపై ఎందుకీ 'ప్రతాపం'
## • బీదపై ప్రత్యర్థి పోరా..? లేక విష్ణుపై ఆధిపత్య జోరా...?

కావలి నియోజకవర్గంలోని అల్లూరు, బోగోలు, కావలి మండలాలలో సమస్యాత్మక పల్లె గ్రామాలు అల్లూరు మండలం లోని అదినారాయణపురం, చంద్రబాబునగర్, ఇస్కపల్లిపాళెం, బోగోలు మండలంలోని పాతపాళెం, కావలి మండలంలోని చెన్నాయపాళెం పట్టపుపాళెం. ఇక్కడ 1994 నుండి వరుసగా రాజకీయదాడులు, ఆధిపత్యపోరులు జరుగుతూ కక్షలూ కార్పణ్యాలకు నిలయంగా ఈ 5 గ్రామాలు పిలువబడుతున్న తరుణంలో 1994, 1995, 2001, 2004, 2006 సంవత్స రాలలో వారి వివాదాలు హత్యల వరకూ కొనసాగాయి. 2006 సంవత్సరంలో వై.యస్.రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్ యస్.పి.ల నేతృత్వంలో ఆ పల్లె పెద్దలను ఇరువర్గాల ప్రతినిధులనూ సమావేశపరచి వాళ్ళమధ్య రాజీతో కూడిన ఒప్పందం చేశారు.



ఆదినారాయణపురం, చెన్నాయపాళెం, పాతపాళెంలో కాంగ్రెస్, చంద్రబాబునగర్, ఇస్కపల్లిపాళెంలో తెలుగుదేశం ఆధిపత్యం వహించే గ్రామాలుగా నిర్ణయించుకుని ఈ రెండుపార్టీలు ఇతర పార్టీకి చెందిన పల్లెల్లోకి రాజకీయపరమైన కారణాలతో వెళ్ళరాదనేది ఒప్పందం. ఆ పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ఇప్పటివరకూ ఎలాంటి గొడవలూ రాకుండా దాదాపు 12సంవత్స రాలుగా ఈ పల్లెలు ప్రశాంతంగా వున్నాయి. తెలుగుదేశం పల్లెలకు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిగాని, కాంగ్రెస్ పల్లెలకు బీద మస్తాన్‌రావు గానీ వెళ్ళకుండా మాటకు కట్టుబడి తమ రాజ కీయాలు సాగిస్తూ వస్తున్నారు.

వై.సి.పి యం.యల్.ఏ రామిరెడ్డి ప్రతాప్ తన పాదయాత్రలో భాగంగా ఈ పల్లెలన్నీ నడుస్తానని చెప్పడంతో ఇప్పుడు జిల్లా పోలీసు యంత్రాంగం తలలు పట్టుకుని కూర్చుంది. ఇక్కడ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్య ఇది ప్రత్యర్థుల పోరు అనడంకన్నా సొంత పార్టీలో వున్న విష్ణువర్ధన్‌రెడ్డి మీద ప్రతాప్ చేస్తున్న ఆధిపత్యపోరుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అటు తెలుగుదేశం ఆధీనంలో వున్న గ్రామాలలోకి తాను వెళ్ళి విష్ణు చేయలేని పని తాను చేస్తున్నానని చూపడం, మరోవైపు కాంగ్రెస్ ఆధిపత్యంలోని గ్రామాలలోకి వెళ్ళి విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వంపై ఆధిపత్యాన్ని చూపించుకునే ప్రయత్నంగా ఎమ్మెల్యే వ్యవహారశైలి వుందని రాజకీయ మేధావులు అంచనా వేస్తున్నారు.

చేసే పని ఏదైనా అది ప్రజలకు మంచి జరిగితే ఫరవాలేదు, కాని తాను చేస్తున్న పని వల్ల పాత కక్షలూ, ప్రత్యర్థి దాడులూ చెలరేగుతాయని తెలిసీ ఇక్కడ పర్యటిస్తానని ప్రతాప్ ప్రకటించడమేమిటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. రాజకీయాలు వేరు వ్యక్తిగత రాగద్వేషాలు వేరు. వ్యక్తిగత కారణాలను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజలలో హింసావాదాన్ని ప్రేరేపించడం మంచిది కాదు.

1966 నుండి 2006 వరకూ దాదాపు 40సంవత్సరాల కాలంలో ఈ పల్లె ప్రాం తాల్లో జరిగిన హింస కారణంగా సుమారు 20మంది చనిపోయారు. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితే సాక్షాత్తూ తన తండ్రి ఆదినారాయణరెడ్డినే కోల్పోయాడు. 2001, 2004, 2006 సమయాల్లో జరిగిన దాడుల క్రమంలో అప్పటి జిల్లా యస్.పిలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి, శివధర్‌రెడ్డి వంటి వారిని ఈ పల్లెల దరిదాపుల్లోకి కూడా వీళ్ళు రానీయ లేదంటే ఇక్కడ వీరి మూర్ఖత్వం ఏ స్థాయిలో ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతాప్ ఓసారి ఆలోచించి ముందుకుపోతే మంచిదని ఇరుపార్టీల వారి అభిప్రాయంగా వినిపిస్తోంది. సమస్య ప్రభుత్వానిదైనా బలి అయ్యేది సామాన్య ప్రజలు కాబట్టి, "రాజన్న" హయాంలో చేసిన రాజీ ఫార్ములాను ప్రక్కనపెట్టి తాను ప్రవర్తిస్తాననడం "రాజన్న"ను అవమానించినట్లేనన్నది వారి భావన. ప్రతాప్ ఓసారి పునరాలో చన చేస్తే మంచిదేమో...!

## వీళ్ళకు అవే పదవులు...





బీజేపీ రాష్ట్ర కమిటీలో తిరిగి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డిని ప్రధానకార్యదర్శిగా, కర్నాటి ఆంజనేయరెడ్డిని అధికార ప్రతినిధిగా నియమించారు. ఇంతకు ముందు కూడా వీళ్ళు అవే పదవుల్లో వున్నారు.




## 'ప్రభా'తం

# ముళ్ళబాటలో... బడిబాట

**పాఠశాలల్లో చదువుకునే పిల్లలు ఇకనుంచీ ప్రతి తరగతిలోనూ నిర్ధేశించిన మార్కులు పొందితేనే పైతరగతులకు పంపాలని, ఫెయిలైన విద్యార్థులను మరోసారి పరీక్షించి, అప్పటికీ పాస్ కాకుంటే అదే తరగతిలో ఉంచాలని లోక్‌సభలో తాజాగా విద్యాహక్కు చట్టం (రెండో సవరణ) బిల్లు సిద్ధమైంది. అయితే, చదువులో వెనుకబడిన బాలలపై దృష్టిపెట్టి వారిని సరిగ్గా చదివిస్తే మంచి ఫలితాలే వస్తాయి కానీ, ఇలా వెనుకబడిన పిల్లల్ని చదువుకు దూరం చేయాలనుకోవడం సముచితం కాదు.**

మనమంతా 'వానాకాలపు చదువులు' అనే నానుడి ఒకటుంది. నాలుగు చినుకులు పడితే చాలు.. బడికి ఇంటి గంట కొట్టేసినట్లే. వానమబ్బులు కనిపిస్తే చాలు..బడిదాకా కూడా వెళ్ళక్కరలేకుండానే, చిత్తుకాగితాలతో కాయితప్పడవలు చేసుకుంటూ హాయిగా ఇంటికాడ కూర్చుంటే సరిపోతుంది..అనేవారు అప్పట్లో. ఎందుకంటే, వానొస్తే ఉరిసే బడులు మనకి కొత్తకాదు. అందువల్ల సెలవు ఇవ్వక తప్పదు. కొన్ని బడుల్లోనైతే అసలు గదులే వుండవు కనుక.. చెట్లకిందనే పాఠాలు చదువుకోవచ్చు. పైన మేఘాలు నల్లబడితే చాలు.. గబగభా లేచి ఇంటికి పోనూవచ్చు. అందువల్ల మన చదువులన్నీ వానాకాలపు చదువులని పేరొచ్చింది. ఆ పాతకాలపు నాటి పరిస్థితి ఇంత అధునాతన కాలం వచ్చినా పోలేదంటే దానికి కారణాలు బోలెడు. అటు ప్రభుత్వాలకి కానీ, ఇటు అధికారగణానికి గానీ విద్యారంగం అభివృద్ధి పట్ల ఆశించిన ఉత్సాహం లేకపోవడమే ప్రధాన కారణం. దానికి తగ్గట్టుగానే విద్యారంగానికి అవసరమైన నిధులుండవు. అటు కేంద్రప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్రప్రభుత్వాలు కానీ ఎంతోకాలం నుంచి విద్యారంగాన్ని ఎదగబెట్టకుండా నిధులివ్వక ఎండబెడుతుండడమే విచారకరం.

అయితే, విద్యాప్రమాణాలు పడిపోతుండడానికి విద్యార్థుల అలసత్వమే కారణమనే అభిప్రాయం మంచిది కాదు. ఇటీవల లోక్‌సభలో తాజాగా ఆమోదించిన విద్యాహక్కు చట్టం (రెండో సవరణ) బిల్లు ప్రతిపాదనలు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేయక మానదు. దాని ప్రకారం, పిల్లలు ఇకపై ప్రతి తరగతిలోనూ నిర్ధేశించిన మార్కులు పొందితేనే పై తరగతులకు పంపుతారు. ఫెయిలైన విద్యార్థులకు ఫలితాలు వెలువడిన రెండు నెలల్లో మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. కానీ, అందులోకూడా పాస్ కాకుంటే మాత్రం ఆ తరగతిలోనే ఉంచేయాలన్నది ఆ కొత్త ప్రతిపాదన. అయితే, గతంలోకి వెళ్తే..బడి-ఈడు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్య అందిస్తామని విద్యార్థులు ఎలా చదివినా వారిని 8వ తరగతి వరకు ఫెయిల్ చేయకూడదని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నారు. 14 ఏళ్ళ లోపు పిల్లలకు తప్పనిసరి విద్య అమలుకావాలన్నదే దాని ముఖ్య ఉద్దేశ్యం. అయితే, పాసయితే ఉపాధ్యాయుల గొప్ప, ఫెయిలైతే విద్యార్థుల తప్పు.. అనే నేటి భావన సరైనది కాదు. ఫెయిల్ కావడమన్నది పిల్లల తప్పుగా భావించి, ఫెయిలయ్యే పిల్లల్ని చదువుకు దూరం చేయాలనుకోవడం సముచితం కాదు. చదువులో వెనుకబడిన బాలలపై దృష్టిపెట్టి వారిని సరిగ్గా చదివిస్తే మంచి ఫలితాలే వస్తాయి.

అసలు మన విద్యాహక్కు చట్టమే లోపభూయిష్టం. విద్యాహక్కు చట్టంలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా దేశంలో ఎన్ని పాఠశాలలు సక్రమంగా ఉన్నాయో నిపుణులతో కమిటీలు వేసి చూస్తే అసలు బండారం బయటపడిపోతుంది. ఇప్పటికీ దేశంలో ప్రాథమిక విద్యారంగ సంస్థలు అనేకానేక అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పాఠశాలలు సక్రమంగా లేకపోయినా, నిబంధనల ప్రకారం ఉండాల్సిన వసతులు పాఠశాలల్లో కనిపించకపోయినా పట్టించుకునేవారు లేరు. మొండిగోడల మధ్యలోనో, చెట్లకిందనో పిల్లలు అవస్థలు పడి చదువుకునే పరిస్థితి నేటికీ దేశంలోని వేలాది పాఠశాలల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత నేటికీ తీవ్రంగా ఉంది. ఏళ్ళతరబడిగా ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ ఇలాంటి సమస్యలను పట్టించుకోకపోవడమే బాధాకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విద్యారంగాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నాయో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.. నాలుగేళ్ళ క్రితం మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 4.57 శాతం కేటాయించిన కేంద్రం, ఈ ఏడాదికి దానిని 3.71 శాతానికి తగ్గించిందంటే విద్యారంగానికి మన ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో, సరస్వతీ నిలయాలుగా వర్థిల్లాల్సిన మన పాఠశాలలు ఎప్పుడూ అవస్థలకు నిలయాలుగానే ఉంటున్నాయి. తాగునీటి సౌకర్యం కానీ, మరుగుదొడ్ల వసతులు వగైరాలు కూడా లేకపోవడం వంటి ఇబ్బందుల సంగతి సరే సరి!.. ఇన్ని రకాల సమస్యల ముళ్ళబాటలో బడిబాట ఎలా సాగాలో ఊహించండి. గత నాలుగేళ్ళలో దేశవ్యాప్తంగా రెండు లక్షల పాఠశాలల దాకా మూతపడ్డాయంటే దేశంలో పాఠశాల విద్య పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. విలీనం పేరుతో అనేక పాఠశాలలు కూడా మూతపడ్డాయి. చాలినన్ని గదులు, మంచి వసతులు, తగినంతమంది ఉపాధ్యాయులు ఉండాలే గానీ, విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి కల్పించి, వారిని బాగా చదివేలా చేయడం పెద్ద కష్టమేమీ కాదన్నది నిపుణుల అభిప్రాయం. ఇక్కడ ఒక్క విషయం ఆలోచించాల్సి ఉంది. దేశంలో నేటికీ ఎంతోమంది విద్యార్థులు దుర్భర పేదరికంతో, రకరకాల సమస్యలతో నలిగిపోతున్నారు. బడుగు, బలహీనవర్గాలు, నిరుపేదల కుటుంబాల్లో ఎన్నో బాధలుంటాయి. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు కూడా వారిమీద ప్రభావం చూపుతుంటాయి. అందువల్ల వారు ఏ కారణంతో చదువుపై ఆసక్తి చూపలేకపోతున్నారో ఉపాధ్యాయులు ఓర్పుతో గ్రహించి, వారిని కూడా చదువులో రాణించేలా కృషిచేయాలే తప్ప ఫెయిలవడం అన్నది విద్యార్థుల తప్పంటూ వారినలాగే వదిలేయడం సరైనది కాదు. ఫెయిలవుతామన్న భయం లేకపోవడం వల్లే విద్యార్థుల్లో అలసత్వం ఏర్పడుతోందని, బాగా చదివే పిల్లలు, చదవని పిల్లలు కూడా పైతరగతులకు వస్తుండడం వల్ల ఉపాధ్యాయులకు బోధన కష్టమవుతున్నదనే వాదనల్లో అసలు అర్థం లేదు. తగినంతమంది ఉపాధ్యాయులుంటే, గురువుల మంచిబోధనలతో ఇలాంటి సమస్యలను సులభంగానే అధిగమించవచ్చు.

ఏదేమైనా, నిరుపేదలు, అట్టడుగువర్గాల పిల్లలకు అన్యాయం చేసే ఈ సవరణ బిల్లును కేంద్రం పునఃపరిశీలన చేసి, ఆ ప్రతిపాదనను విరమించు కోవాల్సివుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి పరిపూర్ణంగా నిధులిచ్చి..పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. విద్యారంగంలో ఉన్న అసౌకర్యాలపై దృష్టిపెట్టి.. పాఠశాలల్లో పుష్కలంగా వసతులు కల్పించి.. అంకితభావంతో విద్యను బోధింపజేయడానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. తద్వారా.. బాలలకు బంగారుభవితను చూపాల్సి ఉంది.

## శాకాంబరిగా కొలువైన శ్రీ రాజరాజేశ్వరి

నెల్లూరు దర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఎండు ఫలాలతో అలంకరించారు. కూరగాయల అలంకారంలో అమ్మవారి గర్భాలయం, అనివొట్టి మండపం నూతన శోభను సంతరించుకుంది. విశేషంగా నాలుగు టన్నులు కూరగాయలు, వివిధ రకాల పండ్లు, పచ్చికతో పాటు బెంగళూరు నుంచి తెప్పించిన పలు రకాల పండ్లును విశేష అలంకారాలకు వినియోగించారు. యాపిల్, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్, గ్రీన్ యాపిల్స్‌తో నిర్వహించిన అలంకారంతో దేవస్థానం శోభాయమానంగా కళకళలాడింది. వివిధ రకాల పండ్లు కూరగాయలతో సప్తమాతృకలో ఒకరైన వజ్ర వారాహి రూపంలో అమ్మవారిని రూపొందించి అనివొట్టి మండపంలో కొలువు దీర్చారు. భక్తులు తొలుత వజ్ర వారాహి అమ్మవారిని దర్శించుకున్న తదుపరి గర్భాలయంలో అమ్మవారిని శాకాంబరిగా దర్శించుకునేందుకు బారులు తీరారు. దేవస్థానం ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ అధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు శాకాంబరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులందరికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఇఒ, సహాయ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రత్నం జయరాం ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## మంత్రికి ఏపి దళిత సంఘాల వినతి



నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న పూర్ణప్రకాష్

నెల్లూరు విఆర్సీ సెంటర్ వద్ద గల డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద, కొండాయపాళెం గేటు వద్ద డా. బిఆర్ అంబేద్కర్ భవనం, బోసుబొమ్మ వద్దగల ఎస్సీ, బీసీ కార్యాలయాల వద్ద చెత్తా చెదారాలతో అపరిశుభ్రంగా వున్నాయని, పశువులు, కుక్కలు ఆయా ప్రాంతాల వద్దకు చేరుకుని అపరిశుభ్రం చేస్తున్నాయని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణకు ఏపి దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రచారకార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో లింగాల రవికుమార్, ఇలపాక ప్రసాద్, వీరమణి సుధాకర్, దద్దోలు మల్లీ గౌడ్, షేక్ ఇంతియాజ్ పాల్గొన్నారు.




## బాబు నాటకం బయటపడింది!

ప్రత్యేకహోదాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడుతున్న నాటకం పార్లమెంటు సాక్షిగా బయటపడింది. 2014 నుండే చంద్రబాబు ప్రత్యేకహోదా కోసం పట్టుబట్టి వుంటే కేంద్రం దిగొచ్చి వుండేది. ప్రత్యేక హోదా వల్ల ప్రజలకు తప్పితే తనకు ప్రత్యేకంగా ఏ ఉపయోగం లేదనుకున్న ఆయన ప్రత్యేక ప్యాకేజీ కోరాడు. కేంద్రానికి ఇది సులభమైన పని. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే మరికొన్ని రాష్ట్రాలు కూడా ప్రత్యేక హోదానే డిమాండ్ చేసేవి. చంద్రబాబు తన స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రత్యేకప్యాకేజీని అంగీకరించడంతో కేంద్రానికి తలనొప్పి తప్పింది. ఈరోజు చంద్రబాబు 'యూ'టర్న్ తీసుకుని ప్రత్యేకహోదా కావాలని అరచినా ఫలితం లేకుండా పోయింది. ఈ నాలుగేళ్ళలో ఏపిని నిలువునా మోసం చేసింది చంద్రబాబే! పార్లమెంట్ సాక్షిగా ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగంలోనే ఆ విషయం అర్ధమైపోయింది.

**జి.ఎస్.రావు, గూడూరు.**

## రోగాలకు సెలవు లేదు!

నెల్లూరు నగరంలోని చాలా ఆసుపత్రులలో ఆదివారం డాక్టర్లు రావడం లేదు. సెలవు అంటున్నారు. పోలీసు, డాక్టర్, జర్నలిస్ట్... ఈ వృత్తుల్లోని వారికి సెలవు అన్న ఆప్షన్ వుండదు. ప్రతి క్షణం వాళ్ళకు డ్యూటీనే! సమస్యలు కాని, రోగాలు కాని ఆదివారం సెలవు అని చెప్పి రాకుండా వుండవు కదా! కాకపోతే డాక్టర్లకు కూడా రిలీఫ్ వుండాలి కాబట్టి అందరూ ఆదివారం అనే కాకుండా ఒక్కొక్కరు ఒక్కో వారం సెలవులో వుంటే ఎమర్జెన్సీ కేసులప్పుడు ఒకరన్నా అందుబాటులో వుంటారు.

**నాగిశెట్టి రమేష్, చెన్నూరు.**

## సమాజానికి ఏం ఉపయోగం!

మా టీవీలో 'బిగ్‌బాస్' పేరుతో వస్తున్న షో మూలంగా సమాజానికి వారు ఇస్తున్న సందేశమేంటో అర్థం కావడం లేదు. కనీసం ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమం కూడా కాదు. షో మొత్తం అక్కడున్న వారి వెకిలి చేష్టలు, పనికిమాలిన టాస్క్‌లతో సాగిపోతుంది. చూసేవాళ్ళకు టైం దండగ! ఇప్పటికే వివిధ ఛానళ్ళలో వస్తున్న సీరియల్స్ సంసారాలను కలుషితం చేస్తున్నాయి. న్యూస్‌ఛానల్స్ తమ పైత్యపు వార్తలతో సమాజాన్ని కలుషితం చేస్తున్నాయి. ఇలాంటి షోలు ఇంకా గబ్బుపట్టిస్తాయి.

**కొరపాటి నరేంద్ర, నెల్లూరు.**

## రాహుల్ అపరిపక్వత

అవిశ్వాస తీర్మానం సందర్భంగా లోక్‌సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బాగానే ప్రసంగించారు. అంతా బాగుందనుకున్న తరుణంలో ఆయన ప్రధాని మోడీని కౌగిలించుకున్న తీరు, ఆ తర్వాత కన్ను కొట్టిన విధానమే ఆయన అపరిపక్వతను తెలియజేస్తున్నాయి. ఒక మనిషిని ఆలింగనం చేసుకోవడానికి సమయం, సందర్భం వుంటుంది. ఎదుటివ్యక్తిపై అభిమానం వుండాలి. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతుండగా రాహుల్ మధ్యలో వెళ్ళి మోడీని కౌగిలించుకోవడం, ఆ తర్వాత వ్యంగ్యంగా కన్ను గీకడం లేకితనంగా వుంది.

**ఎన్.పురుషోత్తం, నెల్లూరు.**

## ఉదయగిరి తెరపై...

# రాముళ్యా..? కృష్ణుడా..?






## లేక మాగుంట కుటుంబీకుడా...?

**నెల్లూరుజిల్లాలో అభివృద్ధిపరంగా చివరిలో వుండే నియోజకవర్గం ఉదయగిరి. రాజకీయ చైతన్యంలో మాత్రం మొదటి స్థానంలో వుంటుంది. ఇక్కడి ప్రజలు శంకర్‌దాదా ఎంబిబిఎస్‌కు తమ్ముళ్ళులాంటి వాళ్ళు. మనుషుల్ని ప్రేమిస్తారు. తమకు కొంచెం మంచి చేసినా గుండెల్లో పెట్టుకుంటారు. పార్టీల కంటే కూడా వ్యక్తులను, వారి నాయకత్వ గుణాలను అభిమానిస్తారు.**

ఉదయగిరి ప్రజల రాజకీయ చైతన్యం ఎలా వుంటుందన్నదానికి ఓ రెండు ఎన్నికలే చిన్న ఉదాహరణ. 1978ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ప్రభంజనం పనిచేసింది. నెల్లూరుజిల్లాలో 11అసెంబ్లీలకు గాను పది సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. ఒక్క ఉదయగిరిలో మాత్రం జనతా పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత ఉపరాష్ట్రపతిగా వున్న వెంకయ్యనాయుడు గెలిచాడు. అంటే ఇక్కడ కాంగ్రెస్ ప్రభంజనం పనిచేయలేదు. 1983 ఎన్నికలను చూద్దాం... రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ప్రభంజనం... నెల్లూరు జిల్లాలో 11సీట్లకు గాను పదింటిలో టీడీపీ ఘనవిజయం... ఉదయగిరిలో మాత్రం బీజేపీ అభ్యర్థి వెంకయ్యనాయుడుకు ప్రజావిజయం... అంటే ఎన్టీఆర్ ప్రభంజనం కన్నా వెంకయ్య వ్యక్తిత్వానికి, నాయకత్వానికే ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు. వెంకయ్య తర్వాత ఉదయగిరికి ఎమ్మెల్యేలుగా వచ్చిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాదాల జానకిరామ్, కంభం విజయ రామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డిలు కూడా దాదాపు అదే పంథాను కొనసాగించారు. ఇక్కడ ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో వుండాలి. ఏదన్నా సమస్య మీద వెళ్లినప్పుడు అప్పటికప్పుడు ఆఫీసర్లకు ఫోన్ చేసి చెప్పాలి. వాళ్ళ ఇళ్ళల్లో పెళ్లి జరుగుతున్నా, కర్మంత్రం జరుగుతున్నా ఎమ్మెల్యే వచ్చి పోవాలి. ఈ నియోజకవర్గంలో ఇలాంటి పట్టింపులు బాగానే వుంటాయి. ఇక్కడి జనం నాడి తెలిసిన వాళ్ళు కాబట్టి గత ఎమ్మెల్యేలు వాటిని బాగానే ఫాలో అయ్యారు.

కాని, ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకే అలాంటి పద్ధతి అనుసరించడం సాధ్యమవడం లేదు. ఆయన కాంట్రాక్ట్ పనులన్నీ మహారాష్ట్రలో... ఎక్కువ రోజులు అక్కడే గడపాలి. అప్పుడప్పుడు నియోజకవర్గానికి రావాలి. వచ్చినా కూడా గ్రామాలలోకి వెళ్ళడం తక్కువ. కలిగిరిలోని తన ఆఫీసులో కూర్చుని నియోజకవర్గ పరిధిలోని 8మండలాల నాయకులను అక్కడికే పిలిపించుకుని మాట్లాడి పంపిస్తుంటాడు. ఆయన ఎవర్నీ కొట్టింది లేదు, ఎవరినీ వేధించిందీ లేదు. కాని ఆయనపై నియోజకవర్గంలో వ్యతిరేకత వుంది. నాయకులు కూడా అసంతృప్తితోనే ఉన్నారు.

ఈ నేపథ్యంలోనే ఉదయగిరికి వచ్చే ఎన్నికల కోసం అభ్యర్థిగా ఎవరిని దింపుతారన్న దానిపై ఊహాగానాలు రేగుతున్నాయి. వ్యతిరేకత వున్నప్పటికీ సిటింగ్ ఎమ్మెల్యేగా బొల్లినేని రామారావుకే అవకాశమిస్తారా? ఉదయగిరిలో వైసిపి బలంగా తయారైంది. ఈసారి ఇక్కడ వైసిపిని ఢీకొట్టాలంటే 'రెడ్డి' వర్గానికి చెందిన నాయకుడినే అభ్యర్థిగా నిలపాలనే ఆలోచనలో కూడా అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. బొల్లినేనికి ఇస్తే 'రెడ్డి' వర్గం ఓట్లు చీలడం కష్టం. టీడీపీ నుండి ఎవరు పోటీ చేసినా 'కమ్మ' సామాజికవర్గం ఓట్లు టీడీపీకే పడతాయి. రెడ్లను చీల్చాలంటే రెడ్డినే అభ్యర్థిగా బరిలోకి దించాలి. ఈ కోణంలో చూస్తే రెండు పేర్లు వినిపిస్తున్నాయి. మాజీఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి... ఉదయగిరి నుండి ఏడుసార్లు పోటీ చేసిన అనుభవంగల నాయకుడు. అయితే ఆయన రాజకీయమంతా కూడా డబ్బుకు అంతగా ప్రాధాన్యం లేనిరోజుల్లో నడిచింది. ఇప్పుడు డబ్బే రాజకీయాల్ని నడిపిస్తోంది. డబ్బు రాజకీయాల్లో కంభం విజయరామిరెడ్డి వంటి నాయకులు నిలవడం కష్టం. అందుకే ప్రత్యామ్నాయంగా జలదంకి మాజీఎంపిపి దగుమాటి కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) పేరు తెరమీద కొచ్చింది. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయంగా ఎదిగిన కృష్ణారెడ్డి 2014లో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి బొల్లినేని రామారావు గెలుపు కోసం పనిచేసాడు. ఆ తర్వాత తెలుగుదేశంలో చేరి పార్టీలో కొనసాగుతున్నాడు. సామాన్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ వ్యాపార రంగంలో రాణించాడు. ఆర్థికంగా నిలబడ్డాడు. రేపు ఎన్నికల్లో దిగినా ఆర్థికంగా మోటుకోగలడు. సీటిస్తే పోటీకి సై అంటున్నాడు.

అయితే ఇదే తరుణంలో ఇక్కడ మాగుంట కుటుంబం పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోంది. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలతో ఆ కుటుంబానికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఒక్క మాగుంట కుటుంబీకులు తప్ప ఇక్కడ తెలుగుదేశం నుండి ఎవరు పోటీ చేసినా గెలుపు అవకాశాలు శూన్యం అన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మాగుంట కుటుంబం నుండి కూడా బలమైన అభ్యర్థి రంగంలోకి దిగే అవకాశాలూ లేకపోలేదని తెలుస్తోంది.

మరి తెలుగుదేశం అధిష్టానం ఉదయగిరి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించనుందో వేచి చూడాలి!

# వైసిపిలో మ్యూజికల్ ఛైర్







## • నాలుగు సీట్లు... ఐదుగురు నేతలు

**మ్యూజికల్ ఛైర్ అనే ఆట గురించి అందరికీ తెలిసే వుంటుంది. మూడు కుర్చీలు వేసుంటారు. నలుగురు వాటి చుట్టూ తిరుగుతుంటారు. మ్యూజిక్ ఆగిపోగానే ఎవరికి దొరికిన కుర్చీలలో వాళ్ళు కూర్చోవాలి. మూడు కుర్చీలే కాబట్టి నాలుగోవాడు బయటకు పోక తప్పదు. ఇప్పుడు జిల్లాలోని వైసిపిలో కూడా అలాంటి మ్యూజికల్ ఛైర్ ఆటే నడుస్తోంది.**

నెల్లూరు లోక్‌సభ, ఆత్మకూరు, వెంకటగిరి, ఉదయగిరి అసెంబ్లీలు... మొత్తం నాలుగు సీట్లు... మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి... ఆ నాలుగు సీట్లకు పోటీ పడబోతున్న ఐదుగురు నాయకులు. ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరే పని లేకుంటే ఈ సమస్య వుండేది కాదు. ఆయన చేరుతుండబట్టే ఎవరికి సీటు కోతేయాలన్న ప్రశ్న వస్తోంది.

ఈ సమస్యకు వైసిపి అభిమానులు, కార్యకర్తలు సూచిస్తున్న పరిష్కారం... ఒకే కుటుంబానికి మూడు టిక్కెట్లు అవసరమా? మేకపాటి కుటుంబానికి రెండు టిక్కెట్లే ఇస్తే సమస్య పరిష్కారమవుతుందంటున్నారు. మరి ఎవరికి కోత వేయాలన్నది కూడా ఇక్కడ సమస్యే! నాది చివరి ఎలక్షన్ అని రాజమోహన్‌రెడ్డి అంటున్నాడు. అదీగాక మొన్న ప్రత్యేకహోదా డిమాండ్‌తో రాజీనామా చేసిన క్రెడిట్ కూడా వుంది. ఆత్మకూరును నేనెందుకు వదులుకుంటానని గౌతం అంటున్నాడు. 2014 నుండి ఉదయగిరి ఇన్‌ఛార్జ్‌గా పార్టీని నడిపిస్తున్నాను, ఇప్పుడు సీటు లేదంటే నేనెందుకు వూరుకుంటానని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అంటున్నాడు. వెంకటగిరిలో ఎవరూ లేనప్పుడు పార్టీకి అండగా నిలిచాను, నాకెందుకు సీటివ్వరు అని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వాదన. సీటిచ్చి పోటీ చేయించే ఉద్దేశ్యం లేనప్పుడు రామనారాయణరెడ్డిని పార్టీలోకి తీసుకోవడం దండగ.

ఈ సమస్య పరిష్కారానికి కొన్ని మార్గాలు వున్నాయి. మేకపాటి రాజమోహన్‌రెడ్డిని రాజ్యసభకో లేదా నరసారావుపేట లోక్‌సభకో పంపించి, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా ఆనంను దించడం. లేదంటే ఒక లోక్‌సభ, ఒక అసెంబ్లీకి మేకపాటి కుటుంబాన్ని పరిమితం చేసి ఆనంకు సీటివ్వడం. మేకపాటి కుటుంబానికి ఒక సీటు తగ్గిస్తే బొమ్మిరెడ్డికి పోటీకి ఛాన్స్ వుంటుంది. దీనివల్ల పార్టీకి మేలే జరుగుతుంది. ఈ నాలుగు సీట్ల విషయంలో పార్టీ అధిష్టానం లోతుగా దృష్టిపెడితే అభ్యర్థుల ఎంపిక పెద్ద కష్టం కాకపోవచ్చు.

## కేంద్రం సంగతి సరే...

# మనమిచ్చిన హామీల సంగతేంటి?



### - ఆదాల ఝలక్

**ఆదాల ప్రభాకర్‌రెడ్డి... పెద్ద రాజకీయ ఉపన్యాసకుడు కాదు. వాక్చాతుర్యం అసలే లేదు. నోటి కొచ్చినట్లు హామీలిచ్చేవాడు కూడా కాదు. చేయలేనివి వంద చెప్పడం కన్నా చేసేవి నాలుగు చెప్పి చేసి చూపించాలనుకునే రకం. చెప్పదలుచుకున్న నాలుగు ముక్కలు సుత్తి లేకుండా సూటిగా చెప్పడం ఆయనకు అలవాటు. అలాంటి నాయకుడు ఏదన్నా సమావేశంలో నోరు తెరిచాడంటే అయిసా పైసా అన్నట్లు సబ్జెక్ట్ తేలిపోవాలి.**

ఇటీవల నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ ఆఫీసులో జరిగిన పార్టీ సమన్వయ కమిటి సమావేశానికి ఆదాల హాజరయ్యాడు. సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలు పార్లమెంటులో టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం, కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, ప్రత్యేకహోదా కోసం తెలుగుదేశం చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచిస్తుండగా మధ్యలో ఆదాల అందుకున్నాడు. కేంద్రం ఇచ్చిన హామీల గురించి మాట్లాడేముందు నెల్లూరుజిల్లా ప్రజలకు మనం ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పుకోవాలి, గత నాలుగేళ్లలో జిల్లా ప్రజలకు ఎన్నో హామీలిచ్చాం, ముఖ్యమంత్రే వరాలు ప్రకటించారు, నెల్లూరుకు రింగ్‌రోడ్డు, మైపాడు, కోడూరు బీచ్‌ల అభివృద్ధి, కాలుష్యానికి కారణమవుతున్న రైస్‌మిల్లులను నగర శివారు ప్రాంతాలకు తరలించడం వంటి హామీలన్నీ పెండింగ్‌లోనే వున్నాయి. మంత్రులుగా ముందు మీరు ఈ హామీల అమలుకు కృషి చేయండి, కేంద్రం ఇచ్చిన హామీల గురించి చంద్రబాబు చూసుకుంటాడనే సరికి అక్కడున్న అందరూ అవాక్కయ్యారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# జిఎస్టీని సక్రమంగా కట్టండి...

## - వ్యాపారులకు జాయింట్ కమిషనర్ సూచన



జిఎస్‌టిని సక్రమంగా చెల్లిస్తూ వ్యాపారులు తమ వ్యాపారాలను ప్రశాంతంగా, క్రమబద్ధంగా చేసుకోవాలని జిఎస్టీ(స్టేట్) జాయింట్ కమిషనర్ ఎస్.ఇ. కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. 23వ తేదీ నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఆయన నెల్లూరు, ప్రకాశం జిల్లాల జిఎస్టీ సహాయ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత ఇంతవరకు రిటర్న్ దాఖలు చేయని, లేదా ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేస్తూ సంబంధిత పన్నులు కట్టని వ్యాపారులపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించాడు. సర్కిల్ పరిధిలో రిటర్న్ దాఖలు చేయని వారిని, పన్నులు చెల్లించనివారిని గుర్తించాలని, జిఎస్‌టి చట్టంలో నిర్దేశించిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యాపారవర్గాలకు జిఎస్‌టిలో అనేకరకాలుగా వెసులుబాటు కల్పిస్తున్నామని, వారు కోరిన విధంగా పన్ను రేట్లు తగ్గిస్తున్నారని, అయినా కూడా కొందరు నిర్దేశిత తేదీలలో రిటర్న్ దాఖలు చేసి పన్నులు కట్టడం లేదని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.నాగజ్యోతి, సోమశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఏపి ఆర్యవైశ్య మహాసభ

# అధ్యక్షుడి రేస్‌లో ద్వారకా



ఆర్యవైశ్య సామాజికవర్గీయులకు సంబంధించి ఏపి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అన్నది ప్రతిష్ఠాత్మకమైన పదవి. ఆ సామాజికవర్గాన్ని ఎంతోకొంత ప్రభావితం చేయగల పదవి. ఈ పదవి ఈసారి నెల్లూరుకు చెందిన డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌కు దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ద్వారకానాథ్ రాజకీయంగా వైసిపిలో వున్నప్పటికీ రాజకీయాల కతీతంగా వైశ్య వర్గాలలో మంచి పేరుంది. గత రెండేళ్ల పాటు నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన తన బాధ్యతలను సమర్ధవంతంగానే నిర్వర్తించాడు. ఇప్పుడు ఏపి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షపదవికి పోటీలోవున్నాడు. ఒకరిద్దరు ఈ పదవికి పోటీ పడాలనుకున్నప్పటికి రాష్ట్ర స్థాయిలో ఆర్యవైశ్య నాయకులు ద్వారకా వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అంతా సవ్యంగా జరిగితే పోటీ లేకుండానే ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి.

## బ్యాంకులో దోపిడీ మెసేజ్‌తో...

# అర్ధరాత్రి హైరానా

ఒక్కోసారి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కూడా కొత్త సమస్యలు వచ్చిపడుతుంటాయి. ఆధునిక టెక్నాలజీ తెచ్చిన సమస్యతో అర్ధరాత్రి పోలీసులు హైరానా పడ్డారు. వివరాలలోకి వెళితే... నెల్లూరు కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లో భారతీయ స్టేట్ బ్యాంక్ పర్సనల్ బ్యాంకింగ్ బ్రాంచ్(పిబిబి) వుంది. ఇది మోడల్ బ్రాంచ్. నిత్యం వాహనాల సంచారంతో పాటు దగ్గర్లోనే పెట్రోల్‌బంకు, రిలయన్స్, హోటల్స్ వుండడంతో సెక్యూరిటీ కూడా వుంటుంది. దీనికితోడు బ్యాంకులో దోపిడీల నివారణ కోసం టెక్నాలజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసారు. క్యాష్ చెస్ట్‌ల వద్ద సి.సి.కెమెరాలు, ఆటోమేటిక్ మెసేజ్, కాల్‌సెండింగ్ మిషన్ వంటివన్నీ ఏర్పాటు చేశారు. క్యాష్ చెస్ట్ వద్దకు ఎవరైనా వెళ్ళి బలవంతంగా తెరవాలని చూస్తే బ్యాంకు మేనేజర్‌కు, అకౌంట్స్ ఆఫీసర్‌కు వెంటనే మెసేజ్‌లు వెళ్ళడంతో పాటు ఫోన్ మోగుతుంది. ఈ క్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి 1.30గంటల ప్రాంతంలో బ్యాంకు చీఫ్‌మేనేజర్ వివేకానందకు, డిప్యూటీ మేనేజర్ (అకౌంట్స్) సుజాతకు అలర్ట్ మెసేజ్‌లు వెళ్ళాయి. వెంటనే వాళ్ళు డయల్ 100కు ఫిర్యాదు చేసారు. అప్పుడు అందుబాటులో వున్న ఎస్బీ సెల్ డిఎస్పీ శ్రీనివాసాచారి నెట్‌లో అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారమిచ్చి అందుబాటులో వున్న సిబ్బందిని అక్కడికి చేరుకోవాల్సిందిగా సూచించారు. సి.సి.ఎస్ ఓఎస్టీ విశలేశ్వర్, నార్త్‌ట్రాఫిక్ సి.ఐ వేమారెడ్డి హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు ఉద్యోగులు అప్పటికే అక్కడకు చేరుకుని వుండడంతో వారి చేత తాళాలు తీయించి లోపలంతా పరిశీలించారు. లోపల ఎలాంటి దోపిడీ ఆనవాళ్ళు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. క్యాష్‌చెస్ట్ వద్ద ఎలుకలు అటు ఇటు తిరగడం వల్లే మెసేజ్ వెళ్ళివుంటుందన్న అభిప్రాయానికొచ్చారు.

# నెల్లూరు కబుర్లు



# జిల్లాలో సెకండ్ సమ్మర్

సంవత్సరంలో మనకు మూడు కాలాలుంటాయి. శీతాకాలం, ఎండాకాలం, వర్షాకాలం... గతంలో సమ్మర్ అంటే గట్టిగా మార్చి నుండి జులై దాకా వుండేది. ఇప్పుడు కాలాలు మారాయి. గతంలో శివరాత్రి దాకా చలికాలం వుండేది. ఇప్పుడు సంక్రాంతికే కాసే ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో వర్షాకాలం అంటే కనీసం రెండు నెలల పాటన్నా ఆ వాతావరణం వుండేది. ఇప్పుడు అర నెలపాటు కూడా వర్షాలు వుండడం లేదు. చలికాలం అంటే డిసెంబర్ సగం నుండి జనవరి సగం దాకా... అంటే పండుగ నెలంతా అన్న మాట... ఇప్పుడు ఈ కాలాలను ఎండాకాలమే ఆక్రమించేసింది. ఫిబ్రవరిలో ఎండలు మొదలైతే అక్టోబర్ దాకా తగ్గడం లేదు. ప్రస్తుతం నెల్లూరుజిల్లాకు సంబంధించి సెకండ్ సమ్మర్ మొదలైనట్లుగా వుంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కాసిన ఎండల దెబ్బకు జనం విలవిల్లాడారు. జులై నెలారంభంలో వాతావరణం కొంచెం చల్లబడినట్లు కనిపించింది. వాతావరణంలో మార్పులతో అప్పుడప్పుడు చిరుజల్లులు కురవడం, గాలులు వీయడం జరిగింది. ఇక ఎండలు పోయినట్లేలే అనుకుంటున్న తరుణంలో మళ్ళీ నాలుగురోజులుగా ఎండలు అదరగొడుతున్నాయి. దీనికితోడు పడమర గాలులుండడంతో ఉక్కపోత ఎక్కువగా వుంటోంది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వర్షాలు పడుతున్నా నెల్లూరుజిల్లా వైపు మాత్రం వాన దేవుడు కన్నెత్తి కూడా చూడడం లేదు.

## గిరీష్ సాహానికి నాయుడమ్మ అవార్డ్



నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతియేటా అందించే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డు ఈ సంవత్సరం బిఏఐఎఫ్(భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్) ప్రెసిడెంట్ గిరీష్ సాహానికి ప్రదానం చేస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ తెలిపారు. గిరీష్ సాహాని ఐ.ఐ.టి, బాంబే, ఐ.ఐ.ఎమ్, అహ్మదాబాద్‌ల నుండి డిగ్రీలు పొందారు. అగ్రికల్చర్, వెటర్నరీ విభాగాలలో గిరీష్ విశేష కృషి చేసారు. బిఏఐఎఫ్ దేశంలో అగ్రికల్చర్, వెటర్నరీ విభాగాలలో పలు పరిశోధనలు చేసి విశేష గుర్తింపు పొందింది. ఈ సంస్థకు గిరీష్ సాహాని గత 25 సంవత్సరాలుగా ప్రెసిడెంట్‌గా వున్నారు. సెప్టెంబర్ 2వ వారంలో నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో గిరీష్ సాహాని 23వ డాక్టర్ నాయుడమ్మ స్మారకోపన్యాసం చేసి 2018 నాయుడమ్మ అవార్డును అందుకుంటారు.

## తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా

# బాధ్యతలు తీసుకున్న భార్గవి



తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా నదా భార్గవి 23వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వైయస్ఆర్ జిల్లా సందలూరు ఆమె స్వగ్రామం. 2007లో గ్రూప్స్‌కు సెలక్ట్ అయ్యారు. తొలుత విజయనగరం జిల్లా పార్వతీపురం ఆర్డీఓగా పని చేసారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఆర్డీఓగాను, తిరుపతిలో లీగల్ సెల్ డిప్యూటీ కలెక్టర్‌గాను, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో స్పెషల్ కమిషనర్‌గాను పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన భార్గవిని కలిసి టీజీపీ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# పచ్చదనం పరిరక్షణలో పోలీసులు



ఎప్పుడూ విధినిర్వహణలతో పనివత్తిడిలో ఉండే పోలీసులు సైతం పచ్చదనాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించారు. పచ్చదనంతోనే అందరికీ ఆరోగ్యం.. సౌభాగ్యం అంటూ మొక్కలు నాటారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కవాతు మైదానంలో ఇటీవల ఈ కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. అడిషనల్ ఎస్పీలు బి.శరత్‌బాబు, వీరభద్రుడు పాల్గొని మొక్కలు నాటారు. అదేవిధంగా, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు, డిఎస్పీ సుధాకర్, ఆర్‌ఐలు చంద్రమోహన్, మౌలాలుద్దీన్, చిరంజీవి, ఆర్‌ఎస్‌ఐలు ఇతర సిబ్బంది అందరూ కలసి మొక్కలు నాటారు. ప్రకృతి ప్రసాదించిన పచ్చదనాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని, అది అందరి బాధ్యత అని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అన్నారు. ముఖ్యమంత్రి, డిజిపిల మార్గనిర్దేశం మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు వారు పేర్కొన్నారు.

# బిజిఆర్ కళాశాలలో అవగాహన సదస్సు



నగరంలోని డా. బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేది ఉదయం కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ తదితర అంశాల పట్ల అవగాహన సదస్సు జరిగింది. ఇంటరాక్టివ్ సెషన్‌లో భాగంగా ప్రముఖ న్యాయవాది పట్టాభి పాల్గొని ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ జెవి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కులే కాకుండా విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్స్ విభాగాధిపతి శ్రీమతి సమత, స్కిల్ డెవలప్‌మెంట్ అధ్యాపకురాలు కుమారి సౌమ్య, సైన్స్ గ్రూప్ అధ్యాపకుడు పురుషోత్తమదాస్‌తో పాటు తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పాల్గొన్నారు.

# మిగిలిపోయిన అన్నం పారేయకండి

## - మేయర్ అజీజ్

నగరంలో జరిగే వివిధ వేడుకల్లో మిగిలిపోయే అన్నాహార పదార్థాలను వృధాగా పారేయవద్దని వాటిని స్వచ్ఛంద సేవాసంస్థల సహకారంతో అన్నార్తులకు అందజేసి మానవత్వం చాటుకుందామని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. ఈ నెల 22న ఆయన 'మీ కోసం మేము' అనే సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుచేసిన ఆహారమిత్ర సేవా కార్యక్రమంలో పాల్గొని రోగులకు, అన్నార్తులకు, పర్యవేక్షకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాటివారికి సేవ చేయాలన్న తపనతో సాధారణ వ్యక్తులందరూ కలసి సంస్థను స్థాపించి ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆనం రంగమయూర్‌రెడ్డి, రాజానాయుడు, సంస్థ నిర్వాహకులు పవన్, సునీల్, సుమలత హరి, కిషోర్, రవి, రాహీల్, షాజిర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆందోళనలు... అరెస్ట్‌ల మధ్య...

# ప్రత్యేకబంద్ విజయవంతం



ఎమ్మెల్యే అనిల్ ఆధ్వర్యంలో నెల్లూరులో బైక్‌ర్యాలీ



ఎమ్మెల్యే కోటంరెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఎక్కడికక్కడ వైసిపి నాయకుల అరెస్ట్‌లు... గృహ నిర్బంధాలు... ఆందోళనల నడుమ కేంద్రం ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా 24వ తేదీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త బంద్ నెల్లూరుజిల్లాలో విజయవంతమైంది. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా ప్రతిపక్షం బంద్‌కు పిలుపునిచ్చినా టీడీపీ అటుంచితే, జనసేన, వామపక్షాలు కూడా మద్దతు పలకలేదు. అయినా కూడా వైసిపి బంద్‌కు ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభించింది.

జిల్లాలోని 10 ఆర్టీసీ డిపోలలో బస్సులు నిలిచిపోయాయి. అప్పటికే లారీల బంద్ జరుగుతుండడం, దీనికితోడు వైసిపి రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో జాతీయ రహదారి బోసిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను స్వచ్ఛంధంగా మూసివేసారు. సోమవారం అర్ధరాత్రి 12గంటలప్పుడే నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండే బంద్ ప్రారంభమైంది. నగరంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. దర్గామిట్టలోని దూరదర్శన్ కేంద్రం వద్ద శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ బైక్‌లో తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గూడూరులో వైసిపి ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీధర్, వెంకటగిరిలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆత్మకూరులో మేకపాటి గౌతంరెడ్డి, ఉదయగిరిలో ఇన్‌ఛార్జ్ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరులో ఇన్‌ఛార్జ్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు బంద్‌ను పర్యవేక్షించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పోలీసులు హౌస్‌అరెస్ట్ చేయడంతో కావలిలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. మండల కేంద్రాల లోనూ వైసిపి శ్రేణులు ఉత్సాహంగా బంద్‌లో పాల్గొన్నాయి.



వింజమూరులో బంద్ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

### మోడీపై తొడగొట్టేది...

# పడగొట్టేది చంద్రబాబే!

## - మంత్రి సోమిరెడ్డి




దేశ రాజకీయాలలోనే ప్రధాని నరేంద్ర మోడీపై తొడగొట్టి యుద్ధానికి దిగినా, రేపు ఎన్నికల్లో మోడీని పడగొట్టినా చంద్రబాబు నాయుడుకే సాధ్యపడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

21వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం ద్వారా ప్రత్యేకహోదాపై ఏపికిచ్చిన మాటను తప్పిన ప్రధాని మోడీని దేశంలోని అన్ని పార్టీల ముందు దోషిగా నిలబెట్ట గలిగామన్నారు. తెలుగుదేశం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వల్లే లోక్‌సభలో అన్ని పార్టీలు మోడీ నియంతృత్వాన్ని ఎండగట్టాయి. చంద్రబాబు అంటేనే మోడీ గజగజ వణుకుతున్నాడు. దేశానికి సమాధానం చెప్పలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వముంది. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వలేమని చెప్పిన మోడీ మరి ఈ రాష్ట్రాన్ని ఏ రూపంలో ఆదుకుంటారో చెప్పలేకపోవడం దురదృష్టకరం. దేశంలోని తెలుగు ప్రజలందరినీ అవమానించేలా లోక్‌సభలో ప్రధాని వ్యవహరించారు. సభలో అవిశ్వాస తీర్మానంపై సీరియస్‌గా చర్చ జరుగుతుంటే మోడీ, రాహుల్‌లు ఒకరిపై ఒకరు జోకులు వేసుకోవడానికి ప్రాధాన్యతనిచ్చారు. కేవలం డైలాగ్‌లతోనే ఈ నాలుగేళ్ళు మోడీ కాలయాపన చేసారు. ప్రతిపక్ష నేత జగన్, ఆయన ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభలు ఎగ్గొట్టి రోడ్ల మీద తిరుగుతున్నారు. బీజేపీతో కలిసి వైసిపి లాలూచీ రాజకీయాలు నడుపుతోంది. ఇక జనసేన నాయకుడు పవన్ జనసున్నా నాయకుడయ్యాడు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించింది. ఈ పోరాటంలో విజయం సాధించే దాకా ఇక వెనుతిరిగే ప్రశ్నే లేదని సోమిరెడ్డి చెప్పుకొచ్చారు.

### కాలుష్య నివారణతో...

# మెదడు వ్యాధులకు చెక్

## - డా॥ బిందుమీనన్



ర్యాలీని ప్రారంభిస్తున్న డా॥ బిందుమీనన్

ఈ నెల 22వ తేదీన ప్రపంచ బ్రెయిన్ డే 2018 సందర్భంగా నెల్లూరులోని అపోలో హాస్పిటల్, జైన్ హబ్ సంయుక్తంగా నెల్లూరులోని విఆర్ కళాశాల నుండి అపోలో ఆసుపత్రి వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలని కోరుతూ అపోలో హాస్పిటల్ నర్సులు, స్వచ్ఛంద సేవా కార్యకర్తలు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా ఈ ఏడాది (క్లీన్ ఎయిర్ ఫర్ హెల్తీ బ్రెయిన్) ఆరోగ్యవంతమైన మెదడు కోసం 'స్వచ్ఛమైన వాయువు' అనే థీమ్‌ను ఎంపిక చేశారని తెలిపారు. ఇటీవలి కాలంలో వాయు కాలుష్య ప్రభావం మనిషి ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతోందన్నారు. అంతర్జాతీయ సంస్థల తాజా సర్వే ప్రకారం వాయు కాలుష్యంతో ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 12 మిలియన్ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ మరణాలన్నీ మయోకార్డియల్ ఇన్ ఫ్రాక్షన్ లేదా రక్తప్రసరణ లేక గుండెపోటు రావడం వంటి గుండెకు సంబంధిత వ్యాధులు,బ్రెయిన్ స్ట్రోక్, కేన్సర్, ఊపిరితిత్తులకు సంబంధించినవని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, మరియు,సిబ్బంది, యూనిట్ హెడ్ నవీన్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్వేతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ పేదలను ఆదుకోవాలి

## - ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం వినతి



అగ్రవర్ణ కులాల్లో పేదలకు జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వాలే అడ్డుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఇటీవల ఆ సంఘానికి జిల్లా నూతన కార్యవర్గాన్ని, నియోజకవర్గ కన్వీనర్లు, కో-కన్వీనర్ల నియామకం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినీత్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ మదన్‌కుమార్‌రెడ్డి జిల్లాలో ఉన్న 10 నియోజకవర్గాల్లో కన్వీనర్లకు నియామకపత్రాలు అందజేశారు. జిల్లా కన్వీనర్‌గా హరితా ఇన్‌ఫ్రా ప్రై.లి, ఛైర్మెన్ బి. వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కో-కన్వీనర్‌గా ఇ. కోటేశ్వరరెడ్డి నియమితులైనట్లు మదన్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. అదేవిధంగా, సూళ్ళూరుపేట నియోజకవర్గ కన్వీనర్, కో-కన్వీనర్లుగా శ్రీనివాసులురెడ్డి, సుకుమార్‌రెడ్డి, గూడూరు కన్వీనర్‌గా తిరుమూరు సురేష్‌రెడ్డి, వెంకటగిరి కన్వీనర్, కో-కన్వీనర్లుగా గంగలపూడి భాస్కర్‌రెడ్డి, పసుపు మోహన్‌రెడ్డి, సర్వేపల్లి కన్వీనర్‌గా విజయభాస్కర్‌రెడ్డి, ఉదయగిరి కో-కన్వీనర్‌గా బొడ్డు వెంకటేశ్వర్లు రెడ్డి, కావలి కన్వీనర్‌గా అశోక్‌రెడ్డి, నెల్లూరు రూరల్ కన్వీనర్, కో-కన్వీనర్లుగా బి.వెంకటేశ్వర్లురెడ్డి (బివి రెడ్డి), బి.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు నగర కన్వీనర్, కో-కన్వీనర్లుగా ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆత్మకూరు కన్వీనర్‌గా గోసల సురేంద్రరెడ్డి, కోవూరు కన్వీనర్, కో-కన్వీనర్లుగా శివకోటారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోషల్‌మీడియా కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం కన్వీనర్‌గా గణేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం కన్వీనర్లుగా ధీరజ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు.

## వైకాపా రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ధనూజరెడ్డి

వైకాపా రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఈదల ధనూజారెడ్డిని నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు ధనూజరెడ్డి ఈ నెల 22న నెల్లూరు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసి గులాబీ మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. తనను పార్టీ గుర్తించి మహిళా కార్యదర్శిగా నియమించిందని అంటూ అందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలకు ఆమె తన కృతజ్ఞతలు తెలియజేశారు.




## మాడరన్‌స్కూల్‌లో...
# తొలి ఏకాదశి పండుగ



నెల్లూరు, సరస్వతినగర్‌లో ఉన్న మాడరన్‌స్కూల్‌లో ఈనెల 23న తొలి ఏకాదశి పండుగను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవైకుంఠనాథుని రాధాకృష్ణుల రూపంలో అలంకరించి, ఆ లక్ష్మీవల్లభుని కృపకు పాత్రులయ్యేందుకు విద్యార్థినీ విద్యార్థులంతా కలసి గోవింద నామస్మరణ చేశారు. బాలికలు కోలాటం ప్రదర్శించి కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో మాడరన్‌స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వేదవ్యాసలో...
# తిలక్, అజాద్ జయంతి వేడుకలు




నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లో ఉన్న వేదవ్యాస స్కూల్‌లో ఈనెల 23న దేశభక్తులు, స్ఫూర్తిప్రదాతలైన బాలగంగాధర తిలక్, చంద్రశేఖర అజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తిలక్, చంద్రశేఖర అజాద్‌ల వేష ధారణతో అందరినీ ఆకట్టుకున్నారు. స్కూల్ కరెస్పాండెంట్ ఎ.పి బాలాజీ ఆ మహనీయుల జీవిత వృత్తాంతాలను విద్యార్థులకు వివరించారు. స్కూల్ డైరెక్టర్ ఏ.పి వేదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రంగనాథాలయంలో...
# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

నెల్లూరు రంగనాయకులపేటలో వున్న ప్రముఖ పుణ్యక్షేత్రం.. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 23న తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివార్లకు 108 లీటర్ల పాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం స్వామివారి గోపురోత్సవం, రాత్రికి బంగారు గరుడోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గరుడవాహనంపై కొలువుదీరిన శ్రీరంగనాథుడు నగర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్ల అభిషేకాలకు కృష్ణచరిత మానస ప్రచారమండలి, గోపురోత్సవానికి అనుమాలశెట్టి కుటుంబ సభ్యులు, బంగారు గరుడసేవకు ఒంగోలుకు చెందిన నున్నా సుధాకరరావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూర్తయిన పలు నిర్మాణాలను ప్రారంభించారు. ప్రసాదాలు, పుస్తకాల విక్రయం, పాదరక్షలు భద్రపరుచు గదులను దాత మునగా వెంకటేశ్వర్లు, జనరేటర్ గదిని మంచికంటి సుబ్రహ్మణ్యం, తలనీలాల గదిని జె.సత్యం, స్నానాల గదిని ఆలయ ఇ.ఓ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయంలో కొలువైవున్న అనంతపద్మనాభస్వామికి హైదరాబాద్‌కు చెందిన కంచర్ల సతీష్‌గుప్తా దంపతులు వెండితొడుగును వితరణగా అందజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# కామాక్షమ్మ సన్నిధిలో స్పెయిన్ దేశస్తులు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో శ్రీ మల్లికార్జునస్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకునేందుకు స్పెయిన్ దేశం నుంచి గమేసా సంస్థ ప్రతినిధులైన మార్సే, ఎంచెలా ఈ నెల 22న జొన్నవాడకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఎంతో వైభవంగా జరుగుతున్న కోటికుంకుమార్చన పూజలను తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి దేవాలయ విశిష్టతను వివరించారు. కొడవలూరు మండలం, రేగడిచెలికలో గమేసా కంపెనీ విస్తరణ కోసం చేస్తున్న పనులను పరిశీలించడానికి వచ్చిన సందర్భంగా వారు జొన్నవాడకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట గమేసా కంపెనీ సహాయ మేనేజర్ తిరుమురుగన్ ఉన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# దాతల సహకారం మరువలేనిది


మాట్లాడుతున్న వై.చలపతిరావు, పక్కన రామ్మోహన్‌రావు, ఎ.శివకుమార్ తదితరులు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం గూడూరు శాఖ బ్రాహ్మణ భవన్ నిర్మాణానికి దాతలు అందించిన సహాయసహకారాలు మరువలేనివని గూడూరు బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని బ్రాహ్మణ భవన్ ఆవరణంలో ఈనెల 22వతేదీ జరిగిన బ్రాహ్మణ సేవాసంఘ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ విరాళాలు అందజేసిన దాతలకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. యేలూరు ప్రకాశం, లలితమ్మ దంపతులు రూ.50వేల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం మహిళా విభాగ ఎన్నిక జరిగింది. బ్రాహ్మణ సేవా మహిళా విభాగ అధ్యక్షురాలిగా కడివేటి పద్మజ, కార్యదర్శిగా వై.వెంకటనాగమణి, కోశాధికారిగా ఆనిమెళ్ళ రాజేశ్వరీదేవి, సభ్యులుగా కడివేటి నిర్మల, కె.లలితమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, పురుషోత్తం, నాగేంద్రప్రసాద్, నాథబ్రహ్మం, ఎస్.వి.శ్రావణ్‌కుమార్, కడివేటి రామమూర్తి, యూత్ సభ్యులు ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# సాయినాథునికి గురుపౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

గూడూరు పట్టణంలోని షిరిడి సాయినగర్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 21న విశేష పూజలను చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు అఖండ సప్తాహం జరిగిందని శ్రీ షిరిడి సాయి కల్చరల్ మిషన్ తరపున శ్రీకంటి రామ్మోహన్‌రావు తెలిపారు. 20వ తేదీ బాబాకు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. 23వ తేదీ శ్రీకంటి రామ్మోహన్‌రావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహ రించారు. ఉదయం హోమం, దత్తాభిషేకం, సాయంత్రం అష్టోత్తరం, సాయి పల్లకి సేవలో పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# లిటిల్ ఏంజల్స్‌లో రోబోటిక్స్ ల్యాబ్



రోబోటిక్స్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న రాధారాణి, పక్కన సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు పట్టణ సమీపంలోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్‌లో లీగో ఎడ్యుకేషన్ వారి అనుబంధంతో రోబోటిక్స్ ల్యాబ్‌ను ఈ నెల 23వ తేదీ జిల్లా సైన్సు అధికారిణి రాధారాణి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ రాబోవు రోజుల్లో విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు వేదికలను ఏర్పాటు చేయాలన్నారు. శాస్త్ర సాంకేతికతను నేటితరం విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, ఆ దిశగా పాఠశాలల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. రాబోవు కాలంలో రోబోట్స్ పాత్ర ఎంతో కీలకమని, మనుషులు చేయలేని పనులు రోబోట్స్ చేస్తాయని చెప్పారు. ఎల్ఏపి పాఠశాలలో విద్యార్థులకు ప్రయోగశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఓం నమశ్శివాయ, హెచ్ఎమ్ జాయ్, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు దశరథరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, లిల్లి, చంద్రమోహన్, శారద తదితరులు పాల్గొన్నారు.

## హ్యూండాయ్ కంపెనీకి
# ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

ప్రముఖ హ్యూండాయ్ కార్ల కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ విభాగానికి నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ మెకానికల్ విభాగం విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఈనెల 21న తెలిపారు. ఫిబ్రవరిలో కళాశాలలో కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారని, మొత్తం ఏడు విభాగాల్లో సెలక్షన్స్ నిర్వహించి ముగ్గురికి ఉద్యోగావకాశాలు కల్పించారని పేర్కొన్నారు. వీరికి వార్షిక వేతనం రూ.3.6 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కంపెనీ కార్యాలయంలో ఎంపికైన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పత్రాలను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ హాజరై కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారని వివరించారు.

# నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న నెల్‌క్యాస్ట్ యాజమాన్యం

గూడూరు పట్టణ సమీపంలో నెల్‌క్యాస్ట్ యాజమాన్యం ఆధ్వర్యంలో దివిపాళెం, చవటపాళెం, అదవయ్య కాలనీ అనాథాశ్రమంలోని సుమారు 1000 మంది విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ బ్యాగులు, నోటుపుస్తకాలతో పాటు ప్లేట్లు, గ్లాసులు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. దివిపాళెం సర్పంచ్ పిట్టి చంద్రసేన భర్త నాగరాజు, నెల్‌క్యాస్ట్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ ఎన్.ఎస్.రెడ్డి, డిజిఎం హెచ్ఆర్ టి.మురళీకృష్ణ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ ఆనిమెళ్ళ శివకుమార్, హెచ్ఎం పి.కాంచన, పురంధర్‌రాజు చేతుల మీదుగా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని నెల్‌క్యాస్ట్ యాజమాన్యం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ సెక్యూరిటీ మేనేజర్ పి.రామమోహన్, ఉపాధ్యాయులు రేవతికుమారి, బలరామయ్య, నాగమణి, కోటేశ్వరరావు, మధుసూదనరావు, ప్రసన్న కవిత తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ఎంపీలకు పార్లమెంటులో సన్మానం

శ్రీను గల్పిక

ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్‌హాల్. లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులంతా వచ్చివున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ప్రధాని నరేంద్రమోడీ, యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఇంకా ఏర్పడని ఫ్రంట్ ఛైర్మెన్, హైటెక్‌రత్న చంద్రబాబు, వివిధ పార్టీలకు చెందిన మమతా బెనర్జీ, శరద్‌పవార్, నితీష్ కుమార్, స్టాలిన్, నవీన్‌పట్నాయక్, ఒమర్ అబ్దుల్లా తదితరులు ఆసీనులై వున్నారు. ఆరోజు రాష్ట్రపతి సెలవులో వుండడంతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చాడు. టీడీపీ ఎంపీలంతా ఆంధ్రాభవన్ నుండి పసుపు కండువాలు మెడల్లో వేసుకుని గుర్రాల మీద బ్యాండ్‌మేళం, బాణాసంచా మోతలతో ర్యాలీగా పార్లమెంటుకు వచ్చారు. పార్లమెంట్ గేటు వద్ద మాజీ మంత్రి గల్లా అరుణ తన కొడుకు గల్లా జయదేవ్‌కు దిష్టితీసి బొట్టు పెట్టి లోపలకు పంపింది. అందరూ రాగానే.... ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అధ్యక్షోపన్యాసం మొదలుపెడుతూ... దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచంలో వున్న 198దేశాల భాషల్లో సభ్యులకు స్వాగతం పలికాడు. ఆయన భాషా ప్రావీణ్యానికి సభ్యులు చప్పట్లతో అభినందించారు. వెంకయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... ఈరోజు ఈ కార్యక్రమం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకుంటున్నాం. ఎప్పుడూ తిట్టుకుంటూ తన్నుకుంటుండే మనం ఎంతో సామరస్యంతో ఈ కార్యక్రమానికి హాజరయ్యాం. ఈరోజు ఈ కార్యక్రమాన్ని మనం జరుపుకోవడానికి ముఖ్యకారణమైన ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీని, అలాగే తెలుగుదేశం ఎంపీలను మనం ఘనంగా సన్మానించుకోవలసిన అవసరముంది. ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా ప్రారంభించాలని కోరుతున్నాను... అని చెబుతుండగా... సభ మధ్యలో నుండి ఏం పొడిచారని వారికి సన్మానం అనే అరుపు వినిపించింది. ఎవరా అని అందరూ అటు వైపు చూసారు. అక్కడ సేవాసుధాకర, వైసిపి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి... పార్లమెంట్‌లో అడుగుపెట్టాక ఫస్ట్‌టైం నోరు విప్పాడు. ఆ విప్పడం కూడా గర్జిస్తూ... అందరూ ఆశ్చర్యంగా తనను చూస్తుండగానే వేమిరెడ్డి మరింత ఆవేశంతో ఏం పొడిచారని చేస్తున్నారు సార్ వారికి సన్మానాలు, ప్రత్యేకహోదా తెచ్చారా... పోలవరం నిర్మించారా... అమరావతికి ఇటుకలు పేర్చారా... భోగాపురం ఎయిర్‌పోర్ట్ కట్టారా...? ఎందుకు చేయాలి సార్ వారికి సన్మానాలు అంటూ ప్రశ్నించాడు. ఆయన ఆవేశం చూసి అన్నిపక్షాల సభ్యులతో పాటు సొంత పార్టీ వైసిపి సభ్యులు కూడా నిశ్చేష్టులయ్యారు. ఆ సమయంలో వారి కంటికి ఆయన... కనిపించని నాలుగో సింహం అంటే ఇలాగే వుంటుందేమో అన్నట్లు కనిపించసాగాడు. ఓ ఐదు నిముషాలు నిశ్శబ్ద వాతావరణం... ఆ తర్వాత ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ... వెంకయ్య... ప్రభాకరా, ఈ సభకు నువ్వు కొత్త... నీకు ఈ సభ కొత్త. వాళ్ళకెందుకు సన్మానం చేస్తున్నామో తెలుసుకోవాలంటే నిన్ను ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్ళాల్సిందే అని చెప్పి వేమిరెడ్డి కళ్ళముందు వేళ్ళతో ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి సీన్‌లు ప్లే చేసాడు.

★★★★★

అది బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీతో పాటు కేంద్రమంత్రులు అనంతకుమార్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్ జైట్లీ, నిర్మలాసీతారామన్, సురేష్‌ప్రభు, పలువురు ఎంపీలు నీరసంగా కూర్చుని వున్నారు. అదే సమయంలో ఉపరాష్ట్రపతి భవన్‌లో పంజరంలోని చిలుకలా కొట్టుకుంటున్న వెంకయ్యకు ఒక్కసారి తన పార్టీ ఆఫీసు చూడాలనిపించింది. అయితే రెగ్యులర్ గెటప్‌లో వెళితే అందరూ గుర్తుపట్టేస్తారని, ప్రోటోకాల్ నియమాలను ఉల్లంఘించినట్లవుతుందని భావించి వెంటనే గెటప్ మార్చాడు. జీన్స్‌ఫ్యాంట్, అయిదారు రంగులు కనిపించే టీషర్ట్ వేసుకుని నెత్తిన శ్రీలంక క్రికెటర్ మలింగ లాగా జట్టు కనిపించేలా విగ్గు పెట్టుకుని 'హార్లీడేవిడ్‌సన్' బైక్‌పై రయ్ మంటూ బీజేపీ ఆఫీసుకు దూసుకుపోయాడు. బయట బైక్ పార్క్ చేసి లోపలకు వెళ్లాడు. వెంకయ్యను చూడగానే రాజ్‌నాథ్‌సింగ్... ఏయ్ ఎవర్నువ్వు, ఏ దేశం నుండి వచ్చావ్, అయినా అనుమతి లేకుండా లోపలకు రావడమేనా... ఏయ్ సెక్యూరిటీ ఇతనిని లోపలకు ఎవరు పంపించారు, బయటకు పంపించేయండి అని అరుస్తుండగా వెంకయ్య టక్కున తన నెత్తిన వున్న విగ్గు తీసాడు. అంతే అందరూ ఆయన్ను చూసి షాక్ అయ్యారు. కొద్దిసేపటికి మోడీ తేరుకుని... ఏం వెంకయ్యాజీ ఈ గెటప్‌లో వచ్చారు అని అడిగాడు. ఏం చేయమంటారు... మీరేమో నన్ను ఆ ఉపరాష్ట్రపతి భవన్‌లో బిగిస్తిరి, నా మనసేమో పార్టీ ఆఫీసు మీదకు లాగుతుండె... ఇక ఉండబట్టలేక పార్టీ ఆఫీసును చూసిపోదామని వచ్చాను. అయినా మీరేంటి దిగులుగా వున్నారని వెంకయ్య అడిగాడు. అందుకు మోడీ... జీవితంలో రోజూ పరుగెడుతూనే వున్నాం. దేశదేశాలు తిరుగుతున్నాం, భారత ప్రతిష్టను పెంచుతున్నాం... దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీజేపీ జెండాను ఎగరేస్తున్నాం... అయినా కూడా మా జీవితాలలో ఏదో తెలియని లోటుందనిపిస్తోంది. దాని వల్లనే మానసికంగా ఉత్తేజితులం కాలేకపోతున్నామన్నాడు. దానికి వెంకయ్య... మీ మానసిక ఉల్లాసం తర్వాత... రేపు అవిశ్వాస తీర్మానం వుంది... ఆ చంద్రబాబు అసలే ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ... అస్త్రశస్త్రాలతో మిమ్మల్ని ముప్పతిప్పలు పెట్టి పుష్కరాల నదుల నీళ్ళన్నీ తాగించగలడు... ఆయన శిక్షణలో టీడీపీ ఎంపీలు రాజకీయ యోధులుగా సభకు వస్తారు. వారి దాడిని తట్టుకోవాలంటే కష్టం... రేపు సభలో టీడీపీ ఎంపీలు చేయబోయే భీకరదాడిని తలచుకుంటే నాకే భయం వేస్తుంది. ఇక మీ పరిస్థితి ఎలా వుంటుందో... జాగ్రత్త! ముందు టీడీపీ ఎంపీల దాడిని ఎదుర్కోవడానికి ప్రిపేర్‌కండి అని చెప్పాడు. ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి. వేమిరెడ్డి అంతా చూసి... ఇక్కడ వాళ్ళకు సన్మానం చేసేంత సీనేముంది అని ప్రశ్నించాడు. అది పార్ట్-1, ఇప్పుడు పార్ట్-2 చూడు... నువ్వు రాజ్యసభలో కూర్చున్నావు కాబట్టి ఇది చూసుండవు అంటూ తన సెల్‌ఫోన్ తీసి ఒక వీడియో ఆన్ చేసాడు వెంకయ్య...

లోక్‌సభలో రాహుల్‌గాంధీ సీరియస్‌గా ప్రసంగించాడు. ప్రసంగం ముగియగానే నేరుగా మోడీ వద్దకు వెళ్ళి కౌగిలించుకున్నాడు. రాహుల్ ఆత్మీయ ఆలింగనంతో మోడీలో మార్పు వచ్చింది. ఎంతసేపు విదేశీ అధ్యక్షులను ఆలింగనం చేసుకోవడం తప్పితే, స్వదేశీ నేతలను ఆలింగనం చేసుకున్నది లేదు. స్వదేశీ నేతల ఆలింగనంలో ఎంత ప్రేముందో ఆయనకు ఆ క్షణంలో తెలిసొచ్చింది. ఇప్పటిదాకా ఇలాంటి ఆత్మీయ స్పర్శను కోల్పోయినందుకు ఆయనలో బాధేసింది. రాహుల్ తర్వాత టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్‌కు మాట్లాడే ఛాన్స్ వచ్చింది. అయితే జయదేవ్ మాట్లాడలేదు... స్పీకర్ ముందు పెద్ద స్క్రీన్ ఒకటి ఏర్పాటు చేయించాడు. ఎదురుగా ప్రొజెక్టర్ ఒకటి పెట్టాడు. తర్వాత ఆయన మాట్లాడుతూ అధ్యక్షా, ఒక ముఖ్యమంత్రి, ఒక దేశానికి రాజు ఎలా నడుచుకోవాలో నేను మాటల్లో చెప్పను, మీకు చూపిస్తాను అంటూ మొదట 'భరత్ అను నేను', ఆ తర్వాత 'బాహుబలి 1 & 2' సినిమాలు వేసి చూపించాడు. సభ్యులందరూ ఎంతో ఆసక్తిగా వాటిని చూసారు. సినిమాలు అయిపోయాక... మోడీ సభనుద్దేశించి... నేను జీవితంలో ఏం మిస్ అవుతున్నానో ఈరోజు తెలిసింది. పరిపాలనా బిజీలో పడి ఎంటర్‌టైన్‌మెంట్‌ను బాగా మిస్సవుతున్నాను. ఈరోజు సభికులందరికీ వినోదం పంచిన రాహుల్‌ను, గల్లా జయదేవ్‌ను రేపు పార్లమెంటులో సన్మానించనున్నాం అని ప్రకటించాడు. ఇక్కడితో వెంకయ్య సెల్‌లో వీడియో ఆగిపోయింది. అప్పుడు వెంకయ్య... ఇప్పుడు చెప్పు ప్రభాకరా... వాళ్ళను సన్మానించడం తప్పంటావా? అని అడిగాడు. దానికి వేమిరెడ్డి... ముమ్మాటికీ తప్పే... కేవలం లోక్‌సభలో మాత్రమే ఆ సినిమాలు చూపించి రాజ్యసభలో ప్రదర్శించకపోవడం తప్పుకాదా? మేం మనుషులం కాదా? మాకూ ఎంటర్‌టైన్‌మెంట్ కావాలని వుండదా? అని ఆయన వేసిన ప్రశ్నకు వెంకయ్య మరో మాట మాట్లాడలేకపోయాడు.

## ప్రత్యేకహోదా..కాంగ్రెస్‌తోనే

మన రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వగల సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమని ఏఐసిసి సభ్యుడు చెంచలబాబు యాదవ్ అన్నారు. ఈనెల 23న ఆయన నెల్లూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వడాన్ని కాంగ్రెస్ బాధ్యతగా తీసుకుంటుందని సోనియాగాంధీ ప్రకటించడం అభినందనీయమన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ సమావేశంలో, మనరాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితర జాతీయనేతలందరూ చర్చించుకుని ఆంధ్రకు అండగా ఉండాలని నిర్ణయించు కోవడం శుభపరిణామమన్నారు. మోదీ, అమిత్‌షా ఆటలు ఇక సాగవని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. రాహుల్‌గాంధీకి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, ప్రశాంత్, కిరణ్, సుమన్‌యాదవ్, ఉడతా నరసింహయాదవ్, వెంకటేశం, శ్రీహరి, శివకుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

## కోడూరుపాడు రోడ్డును విస్తరించండి..

నెల్లూరు కోడూరుపాడు రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. నెల్లూరురూరల్ అల్లీపురంలోని తన నివాసంలో రోడ్డు విస్తరణ పనులపై ఆర్ అండ్ బి, కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షాసమావేశంలో మంత్రి మాట్లాడుతూ నెల్లూరు కోడూరుపాడు రోడ్డును నవాబుపేట నుంచి చిన్న చెరుకూరు క్రాస్ రోడ్డు వరకు విస్తరించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా వున్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.

01-08-2018 బుధవారం ఆ మహనీయుని 41వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి

# టార్గెట్ ఏ.పి

రెండు ప్రాంతీయ పార్టీలు బలంగా వున్న ఏ రాష్ట్రంలో కూడా జాతీయ పార్టీలు మనుగడ సాగించలేవు. తమ పార్టీని విస్తరించలేవు. రాష్ట్ర పరిధిలో ప్రజలు ప్రాంతీయ పార్టీలకిచ్చినంత ప్రాధాన్యత జాతీయ పార్టీలకు ఇవ్వరు. కాని ఏదైనా ఒక ప్రాంతీయపార్టీ రాజకీయంగా పతనమైతే మాత్రం జాతీయ పార్టీ ఎదగడానికి అవకాశముంటుంది.

దేశ రాజకీయాలలోనే ఎంతో కీలకమైన ఆంధ్రప్రదేశ్‌పై జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ప్రస్తుతం కన్నేసాయి. 2014 ఎన్నికలకు ముందు దేశంలోకల్లా కాంగ్రెస్ బలంగా వున్నది ఈ రాష్ట్రంలోనే. ప్రజానాయకుడు వై.యస్. మరణం, ఆయన తనయుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడం, తడిగుడ్డతో గొంతు కోసినట్లుగా నాటి యూపిఏ ప్రభుత్వం చేసిన రాష్ట్ర విభజన వంటి అంశాలు ఏపిలో కాంగ్రెస్ పతనానికి దారితీసాయి. ఒకరకంగా చెప్పాలంటే 2014 ఎన్నికల్లో ఏపి ప్రజలు ఆ పార్టీకి గోతి తవ్వి పూడ్చిపెట్టి సమాధి కట్టేసారని చెప్పవచ్చు. ఇప్పుడు ఏపిలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపిలు బలంగా వున్నాయి. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఇక్కడ పెద్దగా మనుగడ లేదు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను అవి టార్గెట్ చేయడం లేదు. మరో ఐదేళ్ళ తర్వాతైనా రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదగాలనే వ్యూహంతో పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు రెండు కూడా ఏపిపై దృష్టిపెట్టాయి. అయితే వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అయితే పరాజయం పొందుతుందో ఆ స్థానంలో మాత్రమే జాతీయ పార్టీ చొరబడడానికి అవకాశముంటుంది. ముఖ్యంగా టీడీపీ ఓడిపోతే ఆ స్థానంలోకి రావడానికి బీజేపీకి, వైసిపి ఓడిపోతే ఆ స్థానంలో తిరిగి కాంగ్రెస్ పుంజుకోవడానికి ఆస్కారముంటుంది.

ఈసారి టీడీపీ ఓడిపోయి వైసిపి అధికారంలోకి రావడం అంటూ జరిగితే... తెలుగుదేశం కేడర్‌ను కాపాడుకోవడం కష్టం. అదీగాక చంద్రబాబుకు వయసుపైనబడుతుంది. లోకేష్‌కు ప్రతిపక్షంలో వుండి పార్టీని నడిపేంత శక్తి సామర్థ్యాలు లేవు. కాబట్టి కేడర్ పక్క చూపులు చూడడం ఖాయం. టీడీపీ కేడర్‌కు కాంగ్రెస్ కంటే బీజేపీయే ప్రత్యామ్నాయమార్గంగా కనిపించగలదు. అయితే అదే సమయంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే ఏపిపై పట్టు సాధించగలదు.

కాంగ్రెస్‌పార్టీ పతనం కాగా దానిలో వున్న కేడర్ వైసిపిలో చేరడం జరిగింది. వచ్చే ఎన్నికల్లో వైసిపియే గనుక అధికారంలోకి వస్తే ఏపిపై కాంగ్రెస్ ఆశలు వదులుకోవాల్సిందే! అలాకాకుండా వైసిపి ఓడిపోతే కాంగ్రెస్ జీవం పోసుకోవచ్చు. ఈనాటి కాలంలో ప్రతిపక్షంలో పదేళ్ళు కేడర్‌ను నిలుపుకోవడం కష్టం. కాబట్టి వైసిపి కేడర్‌కు కాంగ్రెస్ పాత పార్టీయే కాబట్టి ఆ పార్టీ వైపు చూడొచ్చు. అయితే అదే సమయంలో కేంద్రంలో కాంగ్రెస్సే అధికారంలోకి వచ్చుంటే ఏపిలో సమాధి స్థితి నుండి తిరిగి లేవవచ్చు. ఈ రాష్ట్రంలో వైసిపి ఓడిపోతేనే తమకు మనుగడ ఉంటుందని తెలుసు కాబట్టే కాంగ్రెస్ అధిష్టానం వైసిపి ఓటమే ధ్యేయంగా చంద్రబాబుతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రాజకీయంగా అడుగులు వేస్తోంది.

ఈ రాష్ట్రంలో రేపటి పరిస్థితి వైసిపి ఓడితే కాంగ్రెస్‌కూ, టీడీపీ ఓడితే బీజేపీకి ప్రయోజనం. ఆ దిశలోనే ఈ రెండు జాతీయ పార్టీల అగ్రనాయకులు పావులు కదుపుతున్నారు.

### డా.సి.లక్ష్మీనరసారెడ్డి-సుజనమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# పేద విద్యార్థులకు చేయూత



ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతిభగల విద్యార్థులకు తమవంతు చేయూత నివ్వాలనే ఉద్దేశంతో నెలకొల్పిన డా.సి.లక్ష్మీనరసారెడ్డి-సుజనమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు తగు సాయం అందిస్తున్నామని డా.సి.లక్ష్మీనరసారెడ్డి-సుజనమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ అనుమలశెట్టి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కావలి ప్రభుత్వ పాఠశాలలోని 8,9.10వ తరగతి విద్యార్థులకు తమవంతు చేయూతగా ట్రస్ట్ తరఫున ఒక్కో తరగతికి చెందిన నలుగురు విద్యార్థులకు 2 జతల యూనిఫాం, నోట్‌బుక్స్, స్కూల్‌బ్యాగ్స్, డిక్షనరీ, జామెంట్రిబాక్స్, పెన్‌సెట్‌లతో పాటు స్కూల్‌ఫీజు కూడా చెల్లించామని తెలియజేశారు. గత పన్నెండేళ్ళ నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 23న కావలి జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించామని, కావలి ఆర్డీఓ భక్తవత్సలరెడ్డి, డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయిని సువర్ణలతతో పాటు రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

# విశ్వసాయిలో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న విశ్వసాయి ఛైర్మన్ ఎన్.సత్యనారాయణ

నెల్లూరు మాగుంట లేఅవుట్ లోని విజైన్ ఆల్ఫా మెడికల్ అకాడమీ క్యాంపస్ లో ఈనెల 20న ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలుతో అలరించారు. అనంతరం విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి ఏటా నిర్వహించే ఫ్రెషర్స్ డే వేడుకలు ద్వారా విద్యార్థుల్లో బెరుకుతనం తొలగి కమ్యూనికేషన్స్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. ఒత్తిడి లేని విద్యావిధానం, 5 స్టెప్ ప్రోగ్రాం విధానాలతో విద్యార్థులను ర్యాంకర్లుగా మలచగలుగుతామని తెలిపారు. 2018 నీట్‌లో తమ కళాశాల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు వివిధ కళాశాలల్లో మెడికల్ సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రి, బాటని, జువాలజీ అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న కృష్ణలీలా తరంగ గాత్రకచ్చేరి



నారాయణతీర్థుల వారి జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీకృష్ణ లీలా తరంగ ప్రచారసమితి సమన్వయకర్త, ప్రముఖ గాయని రాళ్ళపల్లి సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 23న టౌన్‌హాలులో నారాయణతీర్థుల వారి 343వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చెన్నైకి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు శంకరికృష్ణన్ ఎంతో శ్రావ్యంగా గానం చేసిన తరంగ గానం అందరినీ ఆలరించింది. శంకరికృష్ణన్ గాత్రానికి అనయంపట్టి వెంకటసుబ్రహ్మణ్యన్ వయోలిన్, రంగనాథన్ మృదంగం వాద్యసహకారాలు అందించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, భిక్షాటనపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి డాక్టర్ వై.నాగదేవిప్రసాద్, నిర్వాహకులు రాళ్ళపల్లి రామసుబ్బారావు, సుబ్బులక్ష్మి దంపతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణతీర్థులు రచించిన 'భక్తిచంద్రిక' పుస్తకాన్ని రాళ్ళపల్లి రామసుబ్బారావు, రాళ్ళపల్లి రాజ్యలక్ష్మి, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, శంకరికృష్ణన్ ఆవిష్కరించగా, విజేత ఆర్ట్స్ కార్యదర్శి శేషగిరీశం తదితరులు పాల్గొన్నారు.

### నవ్యాంధ్ర రచయితల సంఘం

# సిఇఓగా చిన్ని నారాయణరావు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నవ్యాంధ్ర రచయితల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఓ)గా నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు నియమితులయ్యారు. విజయవాడలో ఈనెల 22న రాష్ట్రంలోని ప్రముఖ కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్న కార్యక్రమంలో ఈ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీలో నియమితులైన నెల్లూరు కవి చిన్ని నారాయణరావు సంఘంలో కీలకబాధ్యతలను నిర్వహించనున్నారు. ప్రముఖ కవి, విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గౌరవాధ్యక్షులుగా, కవి-విమర్శకుడు, కళారత్న పురస్కార గ్రహీత బిక్కి కృష్ణ అధ్యక్షులుగా, ప్రముఖ కవి, మల్లెతీగ సాహితీపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ ప్రధాన కార్యదర్శిగా నూతన కార్యవర్గం ఏర్పడిందని చిన్ని నారాయణరావు తెలియజేశారు. యువకవులను ప్రోత్సహించి ఉజ్వల సాహితీచైతన్యానికి దోహదం చేసే కార్యక్రమాలను చేపట్టడం, సాహితీ వికాసానికి కృషి చేయడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కవులు, రచయితలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, సాహితీ రంగంలో కీలకమైన మార్పులు తీసుకురావడమే ధ్యేయంగా నవ్యాంధ్ర రచయితల సంఘం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా, నవ్యాంధ్ర రచయితల సంఘానికి సిఇఓగా నియమితులైన చిన్ని నారాయణరావుకు అభినందనలు తెలియజేస్తూ నెల్లూరుజిల్లాకు చెందిన కవులు, రచయితలు సంతోషం వ్యక్తం చేశారు.

# వివాహబంధాలను కలిపే.. పరిచయవేదికలు



మంచి వివాహ సంబంధాలను కుదుర్చుకోవడంలో వివాహ పరిచయవేదికలు ఎంతగానో తోడ్పడతాయని స్థానిక ప్రముఖుడు రామిశెట్టి సుబ్బారావు అన్నారు. ఈ నెల 22న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన 38వ బలిజ, కాపు, తెలగ వధూవరుల వివాహ పరిచయవేదికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వివాహ వ్యవస్థలో మధ్య దళారీల బెడదను పోగొట్టి వధూవరుల వివరాలను తెలుసుకుని, వారికి నచ్చిన సంబంధాలను ఎంపికచేసుకునేందుకు ఈ వేదికలు బాగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ విశ్రాంత సహాయ సంచాలకులు మనవర్తి వెంకటరత్నం మాట్లాడుతూ, లాభాపేక్ష లేకుండా ఈ పరిచయవేదిక సేవలందిస్తుండడం సంతోషకరమన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ యాదాల చక్రధర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పరిచయవేదిక వ్యవస్థాపకులు ఏకోజి కోటేశ్వరరావు, తోట లోకేశ్వరరావు, గార్లపాటి సుబ్బారావు, పట్నం గిరిజమ్మ, మెతుకు రాజేశ్వరమ్మ, రామిశెట్టి ప్రసాద్, పసుపులేటి లక్ష్మీప్రసాద్, పసుపర్తి కిశోర్, శీలం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# రిచ్ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్



నెల్లూరు పొగతోటలోని రిచ్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు రిచ్ చిన్నపిల్లల హాస్పిటల్ పీడియాట్రిక్ సర్జికల్ యూనిట్ చీఫ్ పీడియాట్రిక్ సర్జన్ డా. పవన్‌కుమార్ నిమ్మల తెలిపారు. బుధవారం రిచ్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దూరుపాడు గ్రామానికి చెందిన భాస్కర్, మరియమ్మ దంపతులకు చెందిన 7 సంవత్సరాల బాబు ఆడుకుంటూ దురదృష్టవశాత్తు మెట్ల మీద నుండి పడి, రెండు రోజుల తర్వాత ఆ బాబు తీవ్రమైన కడుపునొప్పితో వాంతులు, శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో తల్లిదండ్రులు రిచ్ హాస్పిటల్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. ఆ బాబును పరీక్షించగా కడుపులోని ప్రేగులు దెబ్బతిని, చిన్న ప్రేగులలో రెండు రంధ్రాలు ఏర్పడ్డాయన్నారు. రిచ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో వుండటం వల్ల శస్త్రచికిత్సను డా. ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిచ్ హాస్పిటల్ అధినేత డా. టి. రవికుమార్, ఎన్‌టిఆర్ వైద్యసేవ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డా. దయాకర్, పిఐసియు ఇన్‌టెన్సివిస్ట్ డా. నారాయణస్వామి, డా. గోవింద్, డా.హజరత్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో శ్రీనేతాజీ పైలట్‌స్కూల్ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎం.వి.సుబ్బారెడ్డి

కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం వారు గత ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశపరీక్షలకు హాజరైన నెల్లూరులోని శ్రీ నేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ స్కూల్ విద్యార్థులు 25 సీట్లు సాధించారని ఆ స్కూల్ కరెస్పాండెంట్ ఎంవి సుబ్బారెడ్డి తెలియజేశారు. గత 30 ఏళ్ళుగా నవోదయ, కోరుకొండ శిక్షణలో తమ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఆయన ఈనెల 25న పాఠశాలలో జరిగిన సమావేశంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఇన్‌ఛార్జి ఎన్.ప్రసన్న, స్కూల్ డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డి.వాణి, ఏ.ఓ ఆర్.చెంచయ్య, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌విఎల్ నరసింహారావు, ఉపాధ్యాయులు నవాజ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాకేజ్ బాబుకు... ఢిల్లీలో డామేజ్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలు చంద్రబాబును దయనీయ స్థితిలోకి నెట్టాయి. ఆయన పరిస్థితి అత్త తిట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు బాధ అన్నట్లుగా మారింది. మోడీ వ్యాఖ్యలు చంద్రబాబు నైజాన్ని బయటపెట్టాయి. ప్రత్యేకప్యాకేజీకి చంద్రబాబు ఒప్పుకున్నాకే ఆమోదించాం, ఈరోజు ఆయన యూటర్న్ తీసుకున్నారు, వైసిపి ట్రాప్‌లో పడుతున్నావు బాబూ అని నేను హెచ్చరించాను, అయినా ఆయన మమ్మల్ని వదులుకుని వైసిపి ట్రాప్‌లో పడ్డాడు. ఓ పక్క తెలంగాణ సీఎం కేసీఆర్ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుని పరిపాలనలో ముందుకు పోతుంటే, చంద్రబాబు మాత్రం సమస్యలను మెడకు తగిలించుకుని వాటితోనే కాపురం చేస్తున్నాడంటూ మోడీ చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు పరువును బజారుకీడ్చాయి.

వైసిపి, బీజేపీల మధ్య రహస్య స్నేహముందంటూ తెలుగుదేశం నాయకులు, తెలుగుదేశం మీడియా ఇంతకాలం రచ్చచేస్తూ వచ్చింది. అయితే తమ మిత్రులెవరో బీజేపీ నాయకులే పార్లమెంట్ సాక్షిగా చెప్పారు. కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లోక్‌సభలోనే... తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ నుండి బయటకు పోయినా తమ స్నేహం అలాగే కొనసాగుతుందని, చంద్రబాబు ఎప్పటికీ తమ మిత్రుడేనని ప్రకటించి తెలుగుదేశం ఎంపీలకే దిమ్మ తిరిగేలా చేసాడు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రజలలో బీజేపీపై ఉన్న వ్యతిరేకత తమపై పడకుండా చూసుకునేందుకు చంద్రబాబు నానాతంటాలు పడుతూ వచ్చాడు. బీజేపీ బురదను వైసిపికి అంటించాలని చూసాడు. కాని వాళ్ళే వచ్చి తనను కౌగిలించుకునే సరికి ఆ బురదను ఎలా కడుక్కోవాలో తెలియక చంద్రబాబు బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు.

పార్లమెంటులో ఎన్డీఏ ప్రభుత్వంపై తెలుగుదేశంపార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నిద్రపోతున్న గుర్రాని లేపి తన్నించుకున్నట్లుగా వుంది. ప్రత్యేకహోదాపై మాట్లాడే అర్హతను, పోరాడే అర్హతను తెలుగుదేశం పార్టీ ప్రత్యేకప్యాకేజీకి ఒప్పుకున్నప్పుడే కోల్పోయింది. గత నాలుగేళ్ళకాలంలో ప్రత్యేకహోదా కోసం చంద్రబాబు గట్టిగా ప్రయత్నించిన దాఖలాలే లేవు. సరికదా ప్రత్యేకహోదా కంటే ప్యాకేజీకే చంద్రబాబు ఎక్కువగా ఆకర్షితుడయ్యాడు. అర్ధరాత్రి అరుణ్‌జైట్లీ ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి ఏ.పికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదు. ప్రత్యేకప్యాకేజీ ఇవ్వబోతున్నాం అని చెప్పినప్పుడు కూడా చంద్రబాబు పెద్దగా రియాక్ట్ కాలేదు. అంతేకాదు, ప్రత్యేకప్యాకేజీ ప్రకటించినందుకు కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, కేంద్ర బీజేపీ నాయకులకు అప్పట్లో ఘనంగా సన్మానాలు నిర్వహించారు కూడా! ప్రత్యేకహోదా కోసం ఉద్యమాలు చేసిన ప్రతిపక్షంపై ఉక్కుపాదం మోపారు. హోదా అంటే జైలుకే అంటూ బెదిరించారు. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఇంత కసిగా అణచివేయడానికి ప్రయత్నించిన చంద్రబాబు ప్రత్యేకహోదాపై ఇప్పుడు యూటర్న్ తీసుకుని అవిశ్వాసతీర్మానం పెట్టడం వల్లే ఆయన జాతీయ స్థాయిలో అభాసుపాలు కావాల్సి వచ్చింది.

అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి సభలో తగిన సంఖ్యా బలం లేకపోవచ్చు. కాని చంద్రబాబు ఒకప్పుడు జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన నాయకుడు కదా! ఎన్నోకొన్ని ఇతర పార్టీల మద్దతునైనా కూడగట్టి ఉండొచ్చు. కాని ఏపికి చుట్టూ వుండే రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టలేక బొక్కబోర్లా పడ్డాడు.

ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు నాటకాలను ఇటు ప్రజలు నమ్మడం లేదు, అటు రాజకీయ పార్టీలు విశ్వసించడం లేదు. అవిశ్వాస తీర్మానంకు పోయి చంద్రబాబు రాష్ట్రస్థాయిలోనే కాదు ఢిల్లీ స్థాయిలో కూడా ఇమేజ్‌ను పోగొట్టుకున్నాడు.

# పవన్‌పై పేలిన జ'గన్'

(మొదటి పేజీ తరువాయి)

పక్కరోజే జగన్ నుండి తీవ్రస్థాయిలో పవన్‌పై విమర్శలు ఈటెల్లా దూసుకొచ్చాయి. పవన్ కళ్యాణ్ పెళ్ళిళ్ళపై జగన్ మాట్లాడాడు. ఆయన వ్యక్తిత్వాన్ని ప్రశ్నించాడు. సాధారణ పరిస్థితుల్లో అయితే పవన్‌పై జగన్ ఇంతగా విరుచుకుపడి వుండేవాడు కాదేమో! కాని, పవన్ చంద్రబాబు జేబులోని మనిషేనని, ఆయన చెప్పినట్లే పవన్ ఆడుతున్నాడనే పక్కా సమాచారం జగన్‌కు చేరినట్లు తెలుస్తోంది. మంగళగిరి సమీపంలో లింగమనేని గ్రూప్ నుండి పవన్ భూమిని తీసుకుని ఇల్లు కట్టడం మొదలు పెట్టినప్పుడే పవన్ డ్రామా ఆడుతున్నాడనే విషయం అర్ధమైంది. రేపటి ఎన్నికలకు కూడా టీడీపీతో ఆయనకు ప్యాకేజీ ఒప్పందం కుదిరినట్లు తెలిసింది.

వివాహ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే దేశం భారత దేశం. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో మూడుముళ్ళ ఏడడుగులకుండే విలువ చాలా ఎక్కువ. వ్యక్తి నైజాన్ని పరిపక్వతని పరిపూర్ణతని చాటేదే దాంపత్య జీవితం. ఇలాంటి వ్యవస్థలో వరుసగా పెళ్ళిళ్ళు చేసుకున్న, చేసుకుంటున్న 'పవన్' వ్యక్తిత్వాన్ని జగన్ ప్రశ్నించాడు. పవన్ నైతికతపై జగన్ తన బుల్లెట్ పేల్చాడు. సమాజ విలువలు ప్రజల సెంటిమెంట్లు తెలియని వారు రాజకీయాలకేం పనికొస్తారంటూ కొంచెం ఘాటుగానే విమర్శ చేశాడు.

2014లో పవన్ మద్దతు తీసుకోవడం ప్యాకేజీలో భాగం అయితే... ఇప్పుడు పవన్ జనసేన పేరుతో రేపటి ఎన్నికల్లో పోటీ చేయడం ప్యాకేజీ ఒప్పందం. పవన్ ప్రత్యేకంగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలుతాయి. వైసిపి రెబల్ అభ్యర్థులను జనసేనలోకి లాగి టిక్కెట్లు ఇచ్చి అభ్యర్థులుగా నిలబెట్టి వైసిపి ఓట్లను చీల్చవచ్చు. తద్వారా టీడీపీకి మళ్ళీ అధికారమార్గం సుగమం అవుతుంది. పవన్ పక్కాగా మళ్ళీ చంద్రబాబుకు అమ్ముడుపోయాడన్న సమాచారంతోనే జగన్ ఆయనను ఎండగట్టాడని తెలుస్తోంది. చంద్రబాబుకు పవన్ అంటే అమ్ముడుపోయాడు... మరి ఆయన అభిమానులు నిజం తెలుసుకుని ఎలా నడుస్తారో చూడాలి!?



# సినీ గీతానికి వన్నెలు దిద్దిన.. సినారె

(జులై 29, సినారె జయంతి సందర్భంగా)

సినారె (డాక్టర్ సి.నారాయణరెడ్డి) అనగానే ముందుగా మనకు 'విశ్వంభర' గుర్తుకువస్తుంది. భారతీయ భాషల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న వచన గేయకావ్యమది. వైజ్ఞానికంగా, కళాత్మకంగా, ఆధ్యాత్మికంగా సాగిన మానవుని ప్రగతిని వ్యంగ్య సుందరంగా మలిచారు సినారె. అదేవిధంగా, సినారె అనగానే 'రామప్ప' సంగీతరూపకం గుర్తుకొస్తుంది. 'ఈ నల్లని రాలలో' అనే పాట ఇందులోదే. తదుపరి కాలంలో 'అమరశిల్పి జక్కన్న' చిత్రంలోకి వచ్చింది. 'కర్పూరవసంతరాయలు' కావ్యము, లకుమ త్యాగమూ గుర్తుకొస్తాయి. ఇంకా..జలపాతం, విశ్వనాథనాయకుడు, నాగార్జునసాగరము, భూమిక, మంటలూ–మానవుడు, మధ్యతరగతి మందహాసం, రుతుచక్రం, మట్టిమనిషి–ఆకాశం వంటి అనేకానేక కావ్యాలు గుర్తుకొస్తాయి. పద్యాలతో మొదలైన ఆయన సాహితీప్రస్థానం గేయంతో సాగి, వచనగేయ మార్గం పట్టింది. ఆయనకు 'గేయ భగీరథుడు' అనే పేరు తెచ్చిపెట్టింది. సాహిత్య విద్యార్థులకు వారి 'ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు-ప్రయోగములు' చాలా ఉపయుక్త గ్రంథం. ఎన్నో పరిశోధనలకు అది దిక్సూచి. కవిగా, వక్తగా, అధ్యాపకుడిగా ఆయన సుప్రసిద్ధులైనా, సామాన్య ప్రజలకు మాత్రం సినారెగా, సినిమా నారాయణరెడ్డిగా ఆయన ప్రసిద్ధులు, 'నన్ను దోచుకుందువటే' అంటూ సినీరంగ సింహద్వారంలోకి అడుగుపెట్టి, దాదాపు అయిదు దశాబ్దాలపాటు సినీగీతాన్ని మురిపించి.. మెరిపించి, కవ్వించి.. లాలించి నవరసాలతో సినీగీతాభిమానులకు వీనులవిందైన.. పసందైన విందునందించారాయన.

## మధురగీతాల సినారె :

'తోటలో నా రాజు తొంగిచూచెను నాడు' అంటూ ప్రణయగీతాలు రచించినా, 'ఏ పారిజాతమ్ములీయగలనో సఖీ' అంటూ ప్రకృతిలో ప్రణయినిని దర్శింపజేసినా, 'మదనా సుందర నా దొరా' అంటూ శృంగారాత్మకంగా జావళీలు రాసినా, 'మాయదారి సిన్నోడు..నా మనసే లాగేసిండు'..అంటూ జానపదంతో చిందులు వేయించినా, 'నీ ధర్మం, నీ సంఘం, నీ దేశం నువు మరవొద్దు'..అంటూ దేశభక్తిని ప్రబోధించినా, 'సాయి శరణం బాబా శరణు శరణు' అంటూ భక్తిగీతాలు రచించినా, 'వటపత్రశాయికి వరహాల లాలీ'.. అంటూ లాలిపాటలు, 'స్నేహమేరా జీవితం..స్నేహమేరా శాశ్వతం' అంటూ స్నేహపు గొప్పదనాన్ని కీర్తించినా, 'పుత్తడిబొమ్మ మా పెళ్ళిపడుచు' అంటూ పెళ్ళిపాటలు, 'ఈ వేళలో ఈ పూలలో ఎన్నెన్ని రాగాలో'..అంటూ పూలపాటలు రాసినా..ప్రతి గీతంలోనూ సినారె ప్రత్యేకత కనిపిస్తూనే ఉంటుంది. అదే వారి రచనా శైలి..కవితా శైలి. వస్తువు ఏదైనా, కవితా ధాతువు లేని పాటే లేదంటే అతిశయోక్తి కాదు. పదప్రయోగాల్లో, సుదీర్ఘ సమాస చాలనాల్లో, ఆలంకారిక ప్రయోగాల్లో, వర్ణనలలో కనపడే వారి కవితాశైలి రసజ్ఞవేద్యం. ఆయన కలానికి రెండు వైపులా పదునే. "సంగీత సాహిత్య సమలంకృతే..స్వరరాగ పదయోగ సమభూషితే'.. అంటూ గీర్వాణభాషలో వేదాంత రహస్యాలు వివరిస్తూ శారదా స్తుతిని చేయగలరు. మరోవైపు 'కైపున్న మచ్చెకంటి చూపు..అది చూపు కాదు పచ్చల పిడిబాకు'..అంటూ అచ్చతెలుగు పల్లెపదాల్లోనూ పాటలల్లగలరు. అంతేకాదు, గజల్ ప్రక్రియను తెలుగు సినీగీతాల్లో ప్రవేశపెట్టిన ఘనత..డా. సి. నారాయణరెడ్డిగారిదే. "పగలే వెన్నెల, జగమే ఊయల' అనే పాటలోని ప్రతి చరణం చివరా కురిసిపోదా, విరిసిపోదా, మెరిసిపోదా అనే పదాలుండడమే గజల్ టెక్నిక్. అలాగే యుగళగీతాల్లో ప్రశ్న జవాబు పద్ధతినీ వారే పరిచయం చేశారు. వారి గీతరచనలో తొలి సినిమా అయిన 'గులేబకావళి కథ'లో, 'కలల అలలపై తేలెను' అనే పాటలో..

జలకమాడ జవరాలిని చిలిపిగ చూసేవెందుకు?

తడిసీ తడియని కొంగున ఒడలు దాచుకున్నందుకు

చూపుతోనే హృదయవీణ ఝుమ్మనిపించేవెందుకు?

విరిసీ విరియని పరువము మురులుగొలుపుతున్నందుకు.. అంటూ జానపద గీతాల గమనరీతులను కొల్లగొట్టి తన సినీగీతానికి పూలబాటలు వేసుకున్నారు. 'ముత్యాలముగ్గు' చిత్రంలో, 'గోగులు పూచె గోవులు కాచె.. ఓ లచ్చగుమ్మడి' అనే జానపద గేయాన్ని సినీగీతంగా, కవిత్వాంశ గల ప్రణయగీతంగా మలచడంలోనే ఆయన నవ్యతాప్రియత్వం కనపడుతుంది. సినారె పాటల్లో ఆలంకారిక ప్రయోగాలెక్కువ. ముఖ్యంగా ఉపమాలంకార ప్రయోగంలో కొత్తపుంతలు చూపిస్తారాయన.

1. 'దొండపండు వంటి పెదవి పిండుకొనుట ఎందుకు?.. (మురళీకృష్ణ–కనులు కనులు కలిసెను..అనే పాట). 2. 'నవ్వులా..అవి కావు..నవపారిజాతాలు, రవ్వంత సడిలేని రసరమ్యగీతాలు'...(ఏకవీర–తోటలో నా రాజు' అనే పాట). 3. ఎవరన్నారివి కన్నులని..అరరె మధువొలికే గిన్నెలవి...('దొరికితే దొంగలు' చిత్రంలోని పాట ఇది).. ఇలా ప్రతి పాట క్రమాలంకారంతో, ఒకే భావంతో, శిల్పరమణీయంగా కుదురుకుంటుంది. 'డబ్బుకు లోకం దాసోహం' చిత్రంలోని 'మెరిసే మేఘమాలిక..ఉరుములు చాలు చాలిక' అనే పాటలోనూ క్రమాలంకారాన్ని గమనించవచ్చు.

## రవ్వంత సడిలేని రసరమ్యగీతాలు :

తెలుగు భాషను సినారె మరింతగా తీర్చిదిద్దారు. విశ్వవిద్యాలయ అధ్యాపకత్వం దీనికి ఎంతగానో ఉపకరించింది. 'అనురాగ గీతిలోన అచ్చతెనుగు అందం' అంటారొక పాటలో. సినారె సినీగీతాల్లో కనబడే అసంఖ్యాకమైన పదబంధాల్లో కొన్ని చూడండి.

"వన్నెకాడు, జవరాలు, పసిడికిరణాలు, కొదమతేటులు, కోరమీసం, మిసిమి వెన్నెల, రాచవన్నె, మదనుని తూపులు, పచ్చికపానుపు, జిలుగుపైట, కొసచూపు, రామచక్కని, సోగకనులు, చికిలిచూపు, సన్నజాజి మనసు..ఇత్యాది ఎన్నో అందమైన పదాలు కనబడుతాయి.

పాటకు కవితా సింగారాలు కైజేసి, సినీగీతాన్ని కూడా కావ్యపంక్తిలో నిలబెట్టారు సినారె. వారివి 'రవ్వంత సడిలేని రసరమ్యగీతాలు'. వారి చంధశ్శిల్పం 'సురుచిర సుందర తల్పం'. ఆయన గీతాలు అలంకార సమలంకృతాలు. అనౌచిత్యానికి ఆమడదూరాలు. సినారె కలంలోంచి జాలువారిన అలనాటి మధురగీతాలను గుర్తుచెయ్యడం ద్వారా రసజ్ఞపఠితల్లో ఆనందానుభూతి కలుగుతుందనేది నా ప్రగాఢ విశ్వాసం. తీయని జ్ఞాపకాలను మిగిల్చి.. తిరిగిరాని లోకాలకు తరలివెళ్ళిన డా. సి.నారాయణరెడ్డిగారికిదే అక్షర నివాళి!...



డా. కె.ధనలక్ష్మి, పిహెచ్‌డి
నెల్లూరు. ఫోన్ : 9441685248

# ఆత్మకూరు భారం ఆదాలకే!



ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఎవరికి అప్పగించాలి... సోమిరెడ్డి సూచించిన కన్నబాబుకా? అధిష్టానం ఆలోచనలకు తగ్గట్లుగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డికా? వీరిలో ఎవరికిచ్చినా రెండోవారిని పార్టీ దూరం చేసుకోవాల్సి వుంటుంది. అలాకాకుండా వీరిద్దరిని కిలిపి మరో ఇద్దరితో కమిటీ వేసినా వీళ్ళిద్దరూ పూర్తిస్థాయిలో పార్టీ కార్యక్రమాలలో పాల్గొనరు. కాబట్టి పార్టీ మధ్యే మార్గంగా ఆలోచించింది. నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డినే తాత్కాలికంగా, ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చేదాకా ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. ప్రస్తుతం ఆయన నెల్లూరు లోక్‌సభతో పాటు నెల్లూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడు ఆత్మకూరు బాధ్యతను కూడా అదనంగా అప్పగించారు.

మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశాన్ని వీడి వైసిపిలో చేరడం దాదాపు ఖాయమనుకున్న తరుణంలో ఆత్మకూరులో ఎవరిని ఇన్‌ఛార్జ్‌గా పెట్టాలన్నది తెలుగుదేశం అధిష్టానానికి పెద్ద సవాల్‌గా మారడం తెలిసిందే! పార్టీ పరంగా ఇక్కడ ప్రస్తుతం అందుబాటులో వున్నది 2014 ఎన్నికల అభ్యర్థి గూటూరు కన్నబాబు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఇక 2009 ఎన్నికలప్పటికే పార్టీని వదిలేసి పోయిన మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడును కూడా ఆత్మకూరు అభ్యర్థిగా పరిశీలిస్తున్నారు. అయితే అభ్యర్థిని ఖరారు చేయడంకంటే ముందు పార్టీ కార్యక్రమాలు చూడడానికి ఇన్‌ఛార్జ్‌ను నియమించాల్సిన అవసరమొచ్చింది. అయితే ఎవరిని నియమించాలి... గతంలో వున్న కన్నబాబునే నియమిద్దామా అంటే దీనివల్ల పార్టీకి కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమీ లేదు. ఆత్మకూరులో 'రెడ్డి' సామాజికవర్గం బలంగా వుంది. ఈసారి ఆ వర్గం వారికే సీటివ్వాలంటే ఈ కోణంలో అక్కడ కనపడుతున్నది మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఒక్కడే!

ఎలక్షన్‌లు ఇంకెంతో దూరంలో లేవు. ఇప్పటినుండి ఇన్‌ఛార్జ్‌గా వున్న నాయకుడు నియోజకవర్గంలో తిరుగుతుంటేగాని పార్టీపై, కేడర్‌పై గ్రామాలపై ఒక అవగాహన తెచ్చుకోలేని పరిస్థితి. కాబట్టి అభ్యర్థిగా ఎవరినైతే నిలబెట్టదలుచుకున్నారో వారికే ఇన్‌ఛార్జ్‌గా నియమించమని స్థానిక నాయకులు, కార్యకర్తలు కోరుతూ వచ్చారు. ఇన్‌ఛార్జ్ రేసులో వున్న మెట్టుకూరు, కన్నబాబుకైనా, నాకైనా ఎవరికైనా ఒకరికే ఆత్మకూరు నాయకత్వం అప్పగించండని కోరుతూ వచ్చాడు.

అయితే వీరిద్దరిలో ఎవరికి ఇన్‌ఛార్జ్ అన్నది ఇప్పుడే నిర్ణయించడం కష్టతరంగా మారడంతో... తాత్కాలికంగా ఆదాలతోనే సమస్యను పరిష్కరించారు. రేపు ఆత్మకూరు అభ్యర్థి ఎంపిక కూడా నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా ఎంపికకాబడే నాయకుడి ఇష్టానుసారమే నియమించే అవకాశముంది!

## ఎస్పీ బదిలీకి ఎంత ఆత్రమో!

అధికారుల బదిలీలలో రాజకీయ ఒత్తిళ్ళు పనిచేస్తుంటాయి. ఇంతకుముందు అవి పైకి కనిపించేవి కావు. ఇప్పుడు అధికారుల బదిలీల ప్రక్రియ రాజకీయ పార్టీ సమావేశాలలో ఒక చర్చగా మారడమే విస్మయం కలిగిస్తోంది. తెలుగుదేశం పార్టీ జిల్లా సమన్వయ కమిటి సమావేశంలో జిల్లాలో పార్టీ పరిస్థితి, నాయకత్వంపై చర్చించారు. దాంతోపాటు ఎస్పీ బదిలీ వ్యవహారాన్ని చర్చించారు. ఎస్పీ రామకృష్ణను ఎప్పుడు బదిలీ చేస్తున్నారంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మంత్రులను నిలదీసారు. ఆయనకు మరో తెలుగుదేశం నాయకుడు కూడా వత్తాసుపలికాడు. ఒత్తిళ్ళకు లొంగకుండా పనిచేసే అధికారులుంటే రాజకీయ నాయకులు ఎంతగా విలవిలలాడిపోతారన్న దానికి ఇదే ఉదాహరణ.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com